

మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగుళాంబ గద్వాల / నారాయణపేట

## ప్రజావాణిలో 46 దరఖాస్తులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఏప్రిల్ 7 ప్రభాతవార్త:** ప్రజావాణిలో ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులను ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయకుండా, వాటిని ఎప్పటికప్పుడు సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని ప్రజావాణి సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి.అమరేందర్‌తో కలిసి జిల్లా కలెక్టర్ ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ప్రజావాణిలో నమోదయ్యే ప్రజల ఫిర్యాదులను ఎప్పటికప్పుడు తక్షణమే పరిష్కరించాలని తెలిపారు. ప్రజావాణి సమస్యలపై అధికారులు ఎల్లప్పుడూ స్పందిస్తూ, ఫిర్యాదుదారులకు సరైన సమాచారం అందించాల్సిన బాధ్యత ఉందని ఆయన స్పష్టం చేశారు. నేటి ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు తమ వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ మొత్తం 46 దరఖాస్తులను సమర్పించారు. ఈ దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి, త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్, కలెక్టరేట్ వివిధ విభాగాల సూపరింటెండెంట్లు మరియు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి : కలెక్టర్ సిక్తాపట్నాయక్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్, అధికారులు

**నారాయణపేట టౌన్, ఏప్రిల్ 7 ప్రభాతవార్త :** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులకు సూచించారు. ప్రజావాణి సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 25 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవిన్యూ బెంషాలం, ఆర్‌డిఓ రాంచందర్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి



దరఖాస్తులను స్వీకరిస్తున్న కలెక్టర్ సంతోష్

**గద్వాల, ఏప్రిల్ 7 ప్రభాతవార్త :** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ అధికారులకు సూచించారు. కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 37 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను పరిష్కరించాలని విన్నవిస్తూ అర్జీలను జిల్లా కలెక్టర్‌కు సమర్పించారు. వచ్చిన అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు లక్ష్మి నారాయణ, నర్సింగ రావు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ట్యాంక్ బండ్‌ను అద్భుతంగా తీర్చిదిద్దుతాం

- సకల హంగులతో రెండు నెలల్లో అందుబాటులోకి తెస్తాం..
- రూ.కోటి యాభై లక్షలతో మినీ ట్యాంక్ బండ్ అభివృద్ధి
- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి వెల్లడి
- రూ. 50 లక్షల రూపాయల ముడా నిధులతో హైమాస్ట్ విద్యుత్ దీపాల ఏర్పాటుకు శంకుస్థాపన



మాస్టర్ లైట్ల ఏర్పాటుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి



ట్యాంక్ బండ్ పరిసరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో ఏప్రిల్ 7 ప్రభాతవార్త:** మినీ ట్యాంక్ బండ్ వద్ద అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తాం అని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. రూ. 50 లక్షల ముడా నిధులతో సోమవారం మినీ ట్యాంక్ బండ్ పైన హైమాస్ట్ విద్యుత్ దీపాల ఏర్పాటు కోసం శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ , మొత్తం రెండు కోట్ల రూపాయల ముడా నిధులను ఉపయోగించి మినీ ట్యాంక్ బండ్ ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఈరోజు 50 లక్షల రూపాయలతో హైమాస్ట్ విద్యుత్ దీపాల ఏర్పాటు కోసం శంకుస్థాపన చేయడం జరిగిందని, రెండు మూడు రోజుల్లో కోటి యాభై లక్షల రూపాయలతో ఏర్పాటు చేయనున్న సైకిల్ ట్రాక్, నడక దారి, గ్రీనరీ, తదితర అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం జరుగుతుందన్నారు. రానున్న రెండు నెలలలోగా ప్రజలకు మినీ ట్యాంక్ బండ్ అన్ని హంగులతో అందుబాటులోకి తెస్తామన్నారు. మహబూబ్ నగర్ పట్టణ ప్రజలకు అహ్లాదకరమైన వాతావరణంలో మినీ ట్యాంక్ బండ్ ఒక విజిటింగ్ స్పాట్‌గా , వీలైనంత త్వరగా అభివృద్ధి చేస్తామని ఆయన చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో ఫండ్స్ లేమితో ట్యాంక్ బండ్ అభివృద్ధి మధ్యలోనే ఆగిపోయిందన్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో , టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో ట్యాంక్ బండ్ అభివృద్ధి గురించి మాట్లాడడం జరిగిందని, ట్యాంక్ బండ్ అభివృద్ధికి వారు సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏ పనిని మొదలు పెట్టినా మధ్యలో ఆపే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. ట్యాంక్ బండ్‌పై సాయంత్రం వేళలో ఇక్కడికి వచ్చి సేద తీరే వారికి, రాత్రి వేళల్లో ఈ దారిలో వెళ్ళే బాటసారులకు, వాహన చోదకులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు విద్యుత్ దీపాలను ఏర్పాటు చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ ప్రాంతానికి వచ్చే ప్రజలు పరిసరాలు పరిశుభ్రంగా ఉండేవిధంగా చూసుకోవాలి అని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, సిజె బెనహర్, అవేజ్, అజ్మత్ అలి, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు శాంతయ్య యాదవ్, ఖాజా పాషా, మునీర్, మోసిన్, ఉమర్ ఫరూఖ్, అంజద్, నాయకులు రామచంద్రయ్య, గులాం జహీర్, పీర్ మహ్మద్ సాదిక్, అజీజ్ అహ్మద్, చర్ల శ్రీనివాసులు, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

## సలేశ్వరం జాతరకు పకడ్బందీగా ఏర్పాట్లు

- జాతరకు వచే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి
- ఏప్రిల్ 11, 12, 13 తేదీలలో సలేశ్వరం జాతర
- నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఏప్రిల్ 7 ప్రభాతవార్త:** సలేశ్వరం జాతరకు అధికారులందరూ సమన్వయంతో పని చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. సోమవారం నాగర్‌కర్నూలు జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో అదనపు కలెక్టర్ దేవసహాయం, జిల్లా అటవీ శాఖ అధికారి రోహిత్ గోపిడితో కలిసి జిల్లాలోని సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ చెంచు ప్రజల ఆరాధ్య దైవం సలేశ్వర లింగమయ్య జాతరను అత్యంత ప్రతిష్టాత్మకంగా ఏప్రిల్ 11, 12, 13 తేదీలలో (3 రోజుల పాటు) జరుపనున్న నేపథ్యంలో ప్రజలకు కావాల్సిన సదుపాయాలను, వసతులను కల్పించాలని అధికారులను ఆదేశించారు. దట్టమైన నల్లమల్ల అటవీ ప్రాంతంలో లోయలలో కొలువై ఉన్న లింగమయ్య దర్శనార్థం ఇతర రాష్ట్రాలు, రాష్ట్రం నలుమూలల నుండి అత్యధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చే సలేశ్వరం జాతరకు సంబంధించిన ఏర్పాట్లను పూర్తి స్థాయిలో చేపట్టాలని, జాతర రోజుల్లో వైద్య అధికారులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు – మిగతా3లో..

## ప్రకృతి “ వనం” పై నిర్లక్ష్యం

- లక్షలు ఖర్చుపెట్టి ఏర్పాటు చేసిన ప్రకృతి వనాలు మైదానాలుగా మారిన వైనం
- రేపటి తరానికి మనము ఇచ్చే ఆస్తి మొక్కలే అన్నారు.. రక్షణ మరిచారు..
- కరువైన అధికారుల పర్యవేక్షణ





ప్రారంభించి, వదిలేసిన బృహత్ పట్టణ పకృతి వనము ఎండి పోయిన మొక్కలు

**పెబ్బేరు, ఏప్రిల్ 7 ప్రభాతవార్త :** పెబ్బేర్ మున్సిపాలిటీలోని 561, 562 సర్వే నంబర్ భూమిలో 10శాతం ఓపెన్‌ల్యాండ్ కింద 29 డిసెంబర్ 2020 బృహత్ పట్టణ పకృతి వనము అప్పటి మున్సిపల్ పాలకవర్గం ప్రారంభించారు. పార్కు మొత్తం చెట్లు నాటించడంతో ప్రకృతి వనం పచ్చగా అయింది, రేపటి తరానికి మనమిచ్చే ఆస్తి ఈ మొక్కలే అన్నారు, కానీ మొక్కలు నాటండి పర్యావరణాన్ని కాపాడండి అన్న అధికారులు అంతంత మాత్రమే నీళ్ల పోయడం, ఒక సంవత్సరం నుండి పట్టించుకునేవారు కరువయ్యారు. పార్కుకు కంచ లేకపోవడం...లక్షల రూపాయలు ఖర్చుపెట్టి ఏర్పాటు చేసిన పట్టణ పకృతి వనాలను మున్సిపల్ అధికారులు ప్రారంభించి వదిలేశారు. అధికారులు నిర్లక్ష్యంగా వదలివేయడంతో చెట్లు మొత్తం ఎండిపోయి అధ్వానంగా పల్లె ప్రకృతి వనాలు కనిపిస్తున్నాయి. ఏదో మొక్కలు నాటామా? వదిలేశామ అన్నట్టుగా తీరు కనిపిస్తుంది. ఆహ్లాదాన్ని పంచేందుకు పూల మొక్కలను నాటిన ప్రస్తుతం అవి ఎక్కడ కనిపించడం లేదు వానకాలం ముగిసిపోయిన మొక్కలకు నీటిని సరఫరా చేయకపోవడంతో వాడుముఖం పట్టి ఎండిపోతున్నాయి. ఎంతో కొంత ఆదాయం ఉన్న పనులవైపే ముగ్గు చూపుతున్న అధికారులు పట్టణ ప్రకృతి వనాలు జోలికి వెళ్లడం లేదు. ప్రకృతి వనాల్లో పెంచే మొక్కలకు నిత్యం నీటిని అందించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాల్సిన సిబ్బంది అవేమీ పట్టించుకోకపోవడంతో మొక్కల మధ్య పిచ్చి మొక్కలు పెరగడం అవి ఎండిపోయి ఉండడం. పశువులు, పాములు సంచారంతో అటువైపు ఎవ్వరు కూడా కన్నెత్తి చూడకపోవడం శోచనీయం. క్షేత్ర స్థాయిలో మాత్రం పకృతి వనాలు మైదానాలుగా మారిపోయాయి, ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు దానికి కంచవేసి రెండు మూడు రోజులకోసారైనా నీళ్లు చల్లుతే మొక్కలు వచ్చే ఛాన్స్ ఉందని ప్రజలు, పట్టణ ప్రముఖులు అంటున్నారు. ప్రకృతి వనాల పై ప్రత్యేక దృష్టి కేటాయించి వాటిని అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.

### పార్కుకు కంచ ఏర్పాటు చేస్తాం..



పార్కులో మట్టి సరిగా లేదని, దానివల్ల ఎన్ని చెట్లు వేసిన, నీరు పోసిన మొలచడం లేదు. త్వరలో పార్కుకు కంచ వేపిచ్చి చెట్లు నాటి నీళ్లు పోసే టట్లు పనులు చేపడుతామని, ప్రకృతి వనమును మంచి గ్రీనరీ పార్కుగా అభివృద్ధి చేయుటకు కృషి చేస్తాం అన్నారు.

**అశోక్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ పెబ్బేరు**

### పార్కును అభివృద్ధి చేయాలి..



పార్కులో మొక్కలు నాటి మంచి గ్రీనరీ ఏర్పాటు చేసి, అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలి. మొక్కల మధ్య నుంచి వాకింగ్ ట్రాక్, పిల్లలు ఆటా వస్తువులు ఏర్పాటుచేసి ప్రజలకు అందుబాటులో తెస్తే బాగుంటుంది. అధికారులు, నాయకులు పార్కు పై దృష్టి పెట్టి అభివృద్ధి చేయాలి.

**రమేష్, పెబ్బేరు గ్రామం**

## ఫిర్యాదులను వేగంగా పరిష్కరించాలి

వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



అర్జీలను స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్

**వనపర్తి, ఏప్రిల్ 7 ప్రభాతవార్త:** ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో అదనప కలెక్టర్ రెవెన్యూ జి.వెంకటేశ్వర్లు, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య, ఆర్డీవో సుబ్రహ్మణ్యంతో కలిసి ప్రజల నుంచి అదనపు కలెక్టర్ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ, ఫిర్యాదుదారులకు తగిన సమాచారం అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ముఖ్యమంత్రి ప్రజావాణి, మంత్రి ద్వారా ఈ జిల్లాకు సంబంధించిన ప్రజావాణి ఫిర్యాదులు, జిల్లా ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణికి మొత్తం 30 ఫిర్యాదులు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. తహసిల్దార్లు రేషన్ షాపులను తనిఖీ చేయాలి జిల్లాలోని – మిగతా3లో..

## నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తాం

- ఏదుల రిజర్వాయర్ నుంచి నియోజకవర్గానికి లింకు కెనాల్
- త్వరలోనే నియోజకవర్గానికి మరో వెయ్యి కోట్ల అభివృద్ధి పనులు
- పదివేల కోట్లతో నిరుద్యోగ యువతకు రుణ సదుపాయం
- మీ ఇంటి బిడ్డగా పని చేస్తా నియోజకవర్గాన్ని అభివృద్ధి పరుస్తా
- చెక్కుల పంపిణీ కార్యక్రమంలో వనపర్తి శాసనసభ్యులు మేఘారెడ్డి




మాట్లాడుతున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**వనపర్తి ప్రతినిధి, ఏప్రిల్ 7 ప్రభాతవార్త :** వనపర్తి నియోజకవర్గం అభివృద్దే ధ్యేయంగా పనిచేస్తానని, త్వరలోనే రూ.9 వందల 85 కోట్లతో గొల్లపల్లి రిజర్వాయర్ నిర్మాణం చేపట్టనున్నట్లు వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. సోమవారం వనపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కళ్యాణ లక్ష్మిలో, షాది ముబారక్, సిఎంఆర్ఎఫ్, చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తాను ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన నాటి నుంచి నేటి వరకు 15నెలల కాలంలో రూ.1000కోట్ల అభివృద్ధి పనులు చేశానని మరో 1000 కోట్ల అభివృద్ధి పనులకు త్వరలోనే శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ అభివృద్ధి పనులను చూసి ఓర్వలేని కొందరు నాయకులు సోషల్ మీడియా వేదికగా తప్పుడు ప్రచారాలను చేస్తున్నారని, అలాంటి వారి గురించి కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పట్టించుకోవాల్సిన అవసరం లేదని ఆయన సూచించారు. నియోజకవర్గంలో నిర్మించిన ఏదుల రిజర్వాయర్‌తో ఒక్క చుక్కనీరు కూడా నియోజకవర్గానికి రాదని అలాంటి ఏదుల రిజర్వాయర్ నుంచి లింకు కెనాల్ ఏర్పాటుచేసి వనపర్తి నియోజకవర్గంలోని పలు మండలాలకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. పదివేల కోట్ల రూపాయలతో నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పన కోసం రుణ సదుపాయం కల్పించనున్నట్లు తెలిపారు. యోజకవర్గంలో పలు మండలాలలో 30 పడకల ఆసుపత్రులు – మిగతా3లో..

## ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

511 మందికి రేషన్ కార్డులు పంపిణీలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



రేషన్ కార్డులు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఏప్రిల్ 7 ప్రభాత వార్త :** ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. మహబూబ్ నగర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మహబూబ్‌నగర్ గ్రామీణ మండలానికి చెందిన 511 మంది లబ్దిదారులకు నూతన రేషన్ కార్డులను ఆయన పంపిణీ చేశారు. అనంతరం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా ఒక్క లబ్దిదారుడికి కూడా బిఆర్ఎస్ ప్రభుత్వం రేషన్ కార్డు ఇవ్వలేదని, రేషన్ కార్డులు ఇవ్వకపోవడం వల్ల బడుగు బలహీన వర్గాల ప్రజలకు తీరనినష్టం జరిగిందని ఆయన ఆరోపించారు. రేషన్ కార్డు లేకపోవడం వలన ప్రభుత్వ సంక్షేమ పథకాలు వారికి అందలేదని, రాజీవ్ ఆరోగ్యశ్రీ లాంటి పథకాలు పేద ప్రజలు వినియోగించుకోలేక పోయారని అందువల్ల వారు ఆర్థికంగా కూడా చాలా నష్టపోయారని ఆయన మండిపడ్డారు.ప్రజా ప్రభుత్వం గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో అధికారంలోకి రాగానే పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నారని ఆయన గుర్తు చేశారు. రైతులతో సేకరించిన సన్న వడ్లను బియ్యంగా మార్చి తిరిగి ప్రజలకే పంచడం నిజంగా విప్లవాత్మక నిర్ణయం అని అన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, ఐఎన్టీయుసి రాములు యాదవ్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, మత్స్యకారుల సంఘం అధ్యక్షులు గంజి ఆంజనేయులు, అవేజ్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్స్ ఖాజా పాషా, చిన్న , మోసిన్ , నాయకులు శ్రీనివాస్ యాదవ్, అర్షద్ అలి, కిషన్ నాయక్, గోవింద్ యాదవ్, మల్లు అనిల్ కుమార్ రెడ్డి, ధర్మాపూర్ నర్సింహారెడ్డి, తహసీల్దార్ సుందర్ రాజ్, ఎంపిడిఓ కరుణశ్రీ పాల్గొన్నారు.

## ఫిర్యాదులను పెండింగ్ పెట్టొద్దు

- ప్రత్యేకాధికారులు రేషన్‌షాపులను పర్యవేక్షించాలి
- మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేంద్ర బోయి
- ప్రజావాణికి 92 వినతులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ విజయేందిర బోయిఅధికారులను ఆదేశించారు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 92 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు, రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావులకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ప్రజావాణి అనంతరం జిల్లా అధికా రుల సమన్వయ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మండల ప్రత్యేక అధికారులు ఇందిరమ్మ గృహాల గ్రౌండింగ్ వేగవంతం చేయాలని ఆదేశించారు. తాగునీరు సమస్యపై సమీక్షించాలని,ఎక్కడైనా సమస్య ఉంటే నిధులు అవసరం ఉంటే ప్రతిపాదనలు సమర్పించాలని అన్నారు. పంటల పరిస్థితి, విద్యుత్ సరఫరాపై కూడా దృష్టిపెట్టాలని – మిగతా3లో..

## సజావుగా టెన్త్ మూల్యాంకనం ప్రారంభం

- తొలిరోజు 7018 జవాబు పత్రాల మూల్యాంకనం పూర్తి
- డీఈఓ రమేష్ కుమార్



పేపర్ మూల్యంకనం చేసే ఉపాధ్యాయులకు అవగాహన కల్పిస్తున్న డీఈఓ

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఏప్రిల్ 7 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు పేపర్లు మూల్యాంకనం సోమవారం ప్రారంభమైందని నాగర్‌కర్నూల్ జిల్లా విద్యాశాఖ అధికారి ఏ.రమేష్ కుమార్ అన్నారు. లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమైన జవాబు పత్రాల మూల్యాంకనమును 25 తరగతి గదుల్లో ఈ ప్రక్రియను సజావుగా నిర్వహిస్తున్నామని తెలిపారు. మొత్తం 384 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు, 64 మంది చీఫ్ ఎగ్జామినర్లు, 130 మంది, స్పెషల్ అసిటెంట్లు, 50 మందిని అదనంగా పరీక్ష పేపర్లు దిద్దే ప్రక్రియలో నిమగమయ్యారని డీఈఓ తెలిపారు. నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాలు చెందిన సబ్జెక్టు ఉపాధ్యాయులను నియమించినట్లు తెలిపారు. వీరందరూ రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి నాగర్‌కర్నూల్ జిల్లాకు వచ్చిన సుమారు 1,3, 4461 విద్యార్థుల పేపర్లు ఈనెల 15వ తేదీ నాటికి దిద్దాల్సి వుంటుందని ఆయన తెలిపారు. డీఈఓ పరీక్ష కేంద్రాన్ని పరిశీలించి మూల్యాంకనం జరుగుతున్న పరిశీలించి అధికారులకు సూచనలు, సలహాలిచ్చారు. స్పాట్ వాల్యుయేషన్‌లో పాల్గొంటున్న ఉపాధ్యాయులు ఇబ్బంది పడకుండా వారికి తగిన సదుపాయాలను కల్పించినట్లు డీఈఓ తెలిపారు. సోమవారం తొలిరోజు రెగ్యులర్ విద్యార్థులు పరీక్ష పేపర్లు తెలుగు 913, హిందీ 1044, ఇంగ్లీష్ 634, గణితం 1043, ఫిజికల్ సైన్స్ 1464, బయోసైన్స్ 843, సోషల్ 1077 పేపర్లు మూల్యాంకనం చేసినట్లు డీఈఓ రమేష్ కుమార్ తెలిపారు. తొలి రోజు మొత్తం 7018 పేపర్లు మూల్యాంకనం చేసినట్లు తెలిపారు. ప్రతి ఉపాధ్యాయుడికి రోజుకు 40 పేపర్లను మాత్రమే దిద్దేందుకు వీలు ఉంటుందని తెలిపారు. అత్యంత పకడ్బందీగా జాగ్రత్తగా మూల్యాంకన కార్యక్రమాన్ని జిల్లాలో సజావుగా పూర్తి చేయాలని ఉపాధ్యాయులను డీఈఓ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పరీక్షల ఎసి రాజశేఖర్ రావు, అసిస్టెంట్ క్యాంప్ ఆఫీసర్ కురుమయ్య, కార్యాలయ పర్యవేక్షకులు నాగేందర్, మూల్యాంకనం పర్యవేక్షణ అధికారులు సత్యనారాయణ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, నరసింహులు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

**వార్త కథనానికి స్పందన**

## తాగునీటి ఇబ్బందులు రానీయొద్దు

**తక్షణమే బోరు మోటార్ల మరమ్మత్తు చేయించండి**

**మంచినీటి కొరతపై చైర్ పర్సన్ కోనేటి పుష్పలత సమీక్ష**



తాగునీటి పై సమీక్షిస్తున్న చైర్పర్సన్ పుష్పలత

**జడ్చర్ల, ఏప్రిల్ 7 ప్రభాతవార్త:** వేసవి కాలం దృష్ట్యా జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలో అన్ని వార్డులలో మంచినీటి కొరత ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని జడ్చర్ల పుర చైర్ పర్సన్ కోనేటి పుష్పలత ఆదేశించారు. మళ్లీ బోరింగ్ బాట శీర్షికన వార్త దినపత్రికలో వచ్చిన కథనానికి మున్సిపల్ పాలకవర్గం స్పందించారు. ఈ మేరకు మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులతో చైర్పర్సన్ సమీక్షా సమావేశం నిర్వహించారు. అన్ని వార్డులలో మంచినీటి కొరత రాకుండా చెడిపోయిన తాగునీటి బోర్లకు కొత్త మోటార్లు బిగించి వెంటనే అందుబాటులోకి తేవడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మిషన్ భగీరథ వాటర్ సరిపడా రానందువల్ల అక్కడక్కడ కొద్దిగా ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, ఇకముందు ఈ సమస్య తలెత్తకుండా చూడాలని మిషన్ భగీరథ అధికారులకు సూచించారు. పట్టణంలో ఎక్కడ కూడా మంచినీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని వాటర్ డిపార్ట్మెంట్ వారికి చైర్మన్ పుష్పలత ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి, మిషన్ భగీరథ ఏఈ వినోద్ ,మున్సిపల్ ఏఈగాయత్రి, కౌన్సిలర్లు ప్రశాంత్ రెడ్డి, బుక్క మహేష్, కుమ్మరి రాజు, నాయకులు కోనేటి నరసింహులు, బి.కృష్ణారెడ్డి కొండల్, వాటర్ డిపార్ట్మెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

## రేషన్ దుకాణాల్లో మోడీ చిత్రపటం ఉంచాలి

**ఆత్మకూరు, ఏప్రిల్ 7 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఉచిత సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామంటూ ప్రగల్బాలు పలుకుతోందని ప్రభుత్వం అందజేస్తున్న ఆరు కిలోల బియ్యంలో ఐదు కేజీలు కేంద్ర ప్రభుత్వం నుండి వస్తున్న విషయాన్ని స్థానిక అధికారులు గుర్తించాలని ఆత్మకూరు మండల బిజెపి నాయకులు తహశీల్దార్ జాన్ పాషా కు ఫిర్యాదు చేశారు. సోమవారం ఆత్మకూరు మండల బిజెపి పార్టీ అధ్యక్షుడు అశోక్, భూపాల్ యాదవ్, నేతృత్వంలో స్థానిక ఎమ్మార్వో ను కలిసి రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో కొనసాగుతున్న రేషన్ దుకాణాలలో దేశ ప్రధాని నరేంద్ర మోడీ చిత్రపటాన్ని కచ్చితంగా ఏర్పాటు చేయాలంటూ జిల్లా కలెక్టర్లు ఆదేశాలు జారీ చేసినప్పటికీ స్థానిక డీలర్లు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రధాని మోడీ చిత్రపటాన్ని ఉంచకపోవడం ఎంతవరకు సమంజసం అని వారు ప్రశ్నించారు. ఈ విషయంపై స్థానిక తహశీల్దార్ తక్షణమే స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో బిజెపి ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలకు పునుకుంటామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు మనోహర్ గౌడ్, బోరెల్లి రాము, మాసన్న ,జిల్లా కార్యవర్గ సభ్యులు దేవరపల్లి ఆంజనేయులు ,బాలపేరు తదితరులు పాల్గొన్నారు.

## మహనీయుల అడుగుజాడల్లో నడుద్దాం

**పిఎసిఎస్ చైర్మన్ బాలరాజ్ గౌడ్**



సన్నాహక సమావేశంలో పాల్గొన్న గౌడ కులస్తులు

**బిజినేపల్లి, ఏప్రిల్ 7 ప్రభాతవార్త:** సబ్బండ వర్గాలకు రాజకీయ, సామాజిక సమానత్వం కోసం పోరాడిన గొప్ప మహనీయుల అడుగుజాడల్లో నడుద్దామని పిఎసిఎస్ చైర్మన్ నాయినోళ్ల బాలరాజ్ గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో మహాత్మ జ్యోతి రావు పూలే విగ్రహావిష్కరణ సన్నాహక సమావేశంలో గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు. పూలే విగ్రహావిష్కరణ కార్యక్రమానికి గ్రామ గ్రామాన గౌడ కులస్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వారసులుగా పెద్ద సంఖ్యలో హాజరై ఆ మహనీయుని కలల్ని నెరవేర్చాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కార్యక్రమంలో అంతటి రాజేందర్ గౌడ్, దశరథం శ్రీనివాస్ గౌడ్ మల్లేష్ గౌడ్ భగవంతు గౌడ్ నరేందర్ అనిల్ చంద్ర గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు వ్యాసరచన ఉపన్యాస పోటీలు



అంబేద్కర్ జయంతి నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

**ఉట్కూరు, ఏప్రిల్ 7 ప్రభాతవార్త :** భారత రత్న డా. బి.ఆర్ అంబేద్కర్ జయంతి పురస్కరించుకొని ఉట్కూరు మండల కేంద్రంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో మూడవ తరగతి నుంచి తొమ్మిదవ తరగతి విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు కొక్కు శంకర్ మాట్లాడుతూ అంబేద్కర్ లాంటి గొప్ప మేధావి యొక్క జీవిత చరిత్రను ప్రతి ఒక్క విద్యార్థి తెలుసుకోవాలని, అంబేద్కర్ చిన్నతనం నుండి ఏ విధంగా కుల వివక్షతకు గురయ్యాడు అన్నది ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని తెలపడం జరిగింది. భారత రాజ్యాంగ రూపశిల్పి అయిన టువంటి డా.బి.ఆర్అంబేద్కర్ జీవిత లక్ష్యాలను వారిజీవిత చరిత్రను ప్రతి ఒక్క విద్యార్థి తెలుసుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల కేంద్రంలోని ప్రతి పాఠశాల నుంచి 80 మంది విద్యార్థులు వ్యాసరచన ఉపన్యాస పోటీలలో పాల్గొనడం జరిగింది. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు అంబేద్కర్ జయంతి అయినటువంటి ఏప్రిల్ 14న బహుమతులు అందిస్తామని తెలపడం జరిగింది. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం కార్యదర్శి కొండను భరత్, నారాయణ, కొండన్ గోపాల్, దశరథ్, నర్సింలు, నారాయణ, రంగముల్ల, రాజ్ కుమార్, తిమ్మప్ప, నితీష్, శంకర్ తదితర యువకులు పాల్గొన్నారు.

## చట్టాలపై అందరూ అవగాహన కలిగి ఉండాలి



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**ఉట్కూరు, ఏప్రిల్ 7 ప్రభాతవార్త :** ఉట్కూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవ సందర్భంగా న్యాయ అధికారసేవా సంస్థ నారాయణపేట జిల్లా వారి అధ్యర్యంలో ఏప్రిల్ 7 హెల్త్ డే సందర్భంగా ఎఎన్ఎం ఆశ వర్కర్లకు ఆరోగ్యంతో పాటు రైట్స్ చట్టాలపై కోర్టు ద్వారా కూడా ఉచితా న్యాయ సలహాలు పొందడానికి 15100కి ఫ్రీ కాల్ చేసి వివరాలు తెలుసుకొని ఆరోగ్యం పట్ల అవగాహనతో పాటు ప్రతి ఒక్కరు చట్టాలు గురించి అవగాహనా కలిగి ఉండాలి అని పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పిపి) సురేష్ కుమార్, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు లక్ష్మిపతి గౌడ్, నాగేశ్వరీ, డా. సంతోషి, డా. విజయకుమార్, ఆశ కార్యకర్తలు లక్ష్మి పుష్పలత, ఎఎన్ఎం సుజాత, కవిత, గోవిందమ్మ, మహేశ్వరి, పార లీగల్ వాలెంటరీలు సభ్యులు ఆ హాజమ్మా, నరసింహులు, నారాయణ, ఉమా, వర్ష, శక్తి ఫౌండేషన్ అధ్యక్షులు శివప్రసాద్ రెడ్డి, కానిస్టేబుల్, మాత్రునాయక్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రీవెన్స్ డే సందర్భంగా ఫిర్యాదుల పరిశీలన:డీఎస్పి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న డీఎస్పీ

**నారాయణపేట టౌన్, ఏప్రిల్ 7 ప్రభాతవార్త :** గ్రీవెన్స్ డే సందర్భంగా వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని డీఎస్పీ ఎన్. లింగయ్య అన్నారు. ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డేలో భాగంగా సోమవారం నారాయణపేట సబ్ డివిజన్ పోలీస్ కార్యాలయంలో డీఎస్పీ నల్లపు లింగయ్య జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 04 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు. పోలీస్ స్టేషన్‌కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి బాధితులకు న్యాయం అందే విధంగా చూడడం జరుగుతోందని డీఎస్పీ తెలిపారు. పోలీస్ స్టేషన్‌కి, పై ఆఫీసులకి వచ్చే ఫిర్యాదుదారులు మధ్యవర్తులని తీసుకురావద్దని బాధితులు మాత్రమే నేరుగా వచ్చి ఫిర్యాదుకు సంబంధించిన విషయాలు తెలపాలని డీఎస్పీ తెలిపారు.

# పేదలకు సేవ చేయడం అభినందనీయం



అంబలి కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

**మక్తల్, ఏప్రిల్ 7 ప్రభాతవార్త :** సామాజిక సేవా దృక్పథంతో పేద ప్రజలకు సేవ చేయడం అభినందనీయమని, గత 27 సంవత్సరాలుగా మండువేసవిలో పేదలకు ఉచితంగా అంబలి అందచేయడం గర్వకారణమని మక్తల్ ఎమ్మెల్యే డా. వాకిటి శ్రీహరి అన్నారు. మక్తల్ పట్టణంలోని పడమటి ఆంజనేయస్వామి ఆలయం వద్ద కొత్త సూగయ్య, రత్నమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబలి కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ట్రస్టు ఆధ్వర్యంలో స్థానిక వేణుగోపాల స్వామి ఆలయ పునర్నిర్మాణం కొరకు రూ.5 లక్షల విరాళం అందజేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి జి. లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీపీ బి. కొండయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గణేష్ కుమార్, నాయకులు కొత్త సూర్యనారాయణ గుప్తా, రాజుల అశిరెడ్డి, కోళ్ల వెంకటేష్, కట్ట సురేష్, రవికుమార్, వల్లంపల్లి లక్ష్మణ్, నీలప్ప, రహీం పటేల్, అమర్, మందుల నరేందర్, రంజిత్ రెడ్డి, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

**సన్నబియ్యం పథకాన్ని సద్వినియోగం చేసుకోండి**

ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి ప్రభుత్వం పేద ప్రజలకు రేషన్ కార్డుల ద్వారా సన్నబియ్యం అందజేస్తున్నదని, ఈ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మక్తల్ ఎమ్మెల్యే డా. వాకిటి శ్రీహరి అన్నారు. మక్తల్ మండలంలోని లింగంపల్లి రేషన్ దుకాణం వద్ద సోమవారం లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఒక కేజీ సన్న బియ్యం పంపిణీకి గాను ప్రభుత్వం రూ.40లను వ్యయం చేస్తున్నదని అన్నారు. గతంలో దొడ్డు బియ్యం ఇస్తుండడంతో పేద, మధ్యతరగతి వారు వాటిని తినేందుకు ఇబ్బందులు పడే వారన్నారు. దీంతో మధ్య దళారులు రేషన్ బియ్యం అక్రమ రవాణాకు పాల్పడ్డారని అన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వమే పేదలకు సన్నబియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టిందన్నారు. కార్యక్రమంలో తహసిల్దార్ సతీష్ కుమార్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గణేష్ కుమార్, మక్తల్ పట్టణ అధ్యక్షుడు రవికుమార్, నాయకులు సీతారామారావు, శివ తదితరులు పాల్గొన్నారు.



సన్నబియ్యం పంపిణీని ప్రారంభించిన ఎమ్మెల్యే

## అతిపెద్ద రాజకీయ పార్టీగా బీజేపీ

**క్రమశిక్షణ, అంకిత భావంతో పనిచేయాలి.. బిజెపి రాష్ట్ర కోశాధికారి భండారి శాంతికుమార్**



జెండా ఆవిష్కరణలో పాల్గొన్న బండారి శాంతి కుమార్

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఏప్రిల్ 7 ప్రభాతవార్త:** 1980 లో పార్టీ ఆవిర్భవించిన నాటి నుండి ప్రజల మధ్యన ఉన్నందుకే ఇవాళ ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా బీజేపీ అవతరించిందని బీజేపీ రాష్ట్ర కోశాధికారి భండారి శాంతికుమార్ పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ లోని ఆయన నివాసంపై బీజేపీ జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా శాంతికుమార్ మాట్లాడుతూ డా.శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ, పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ఆలోచనలకు అనుగుణంగా సిద్ధాంతం ప్రకారం బీజేపీ ముందుకు వెళ్తుందని వ్యాఖ్యానించారు. 1984 సంవత్సరంలో కేవలం రెండు స్థానాలలోనే విజయం సాధించిన పార్టీ క్రమక్రమంగా ఎదిగి బలమైన శక్తిగా అవతరించిందని శాంతికుమార్ అన్నారు. క్రమశిక్షణతో, అంకితభావంతో పనిచేసే వారికి బీజేపీలో ఎల్లప్పుడూ ప్రత్యేక స్థానం ఉంటుందని ఆయన వివరించారు. విలువల కోసం, సిద్ధాంతాల కోసం పనిచేసే వారు బీజేపీలో ఉన్నారని శాంతికుమార్ స్పష్టం చేశారు. దేశ ప్రజలు కేంద్రంలో వరుసగా మూడవసారి బీజేపీకి అవకాశం ఇవ్వడంతో నరేంద్రమోదీ నాయకత్వంలో ప్రస్తుతం దేశంలో సమర్థవంతమైన పరిపాలన కొనసాగుతుందని భండారి శాంతికుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సి మోర్చా రాష్ట్ర నాయకులు కొండయ్య, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రతాప్ రెడ్డి, నంబిరాజు, ఆంజనేయులు, పిల్లి సూర్యనారాయణ, నాగరాజు, మఠం మయుర్నాథ్, కురుమూర్తి, మల్లేష్, కిట్టు, రవి నాయక్, మున్నూర్ రాజు, దోమ సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాడుదాం



విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న కార్మిక నాయకుడు

**చిన్న చింతకుంట, ఏప్రిల్ 7 ప్రభాతవార్త:** అసంఘటిత కార్మికుల సమస్యల సాధనకు కార్మికులందరూ కలిసి పోరాడాలని టియుసిఐ జిల్లా అధ్యక్షులు దేవదానం పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈనెల 20న జరిగే దేశ వ్యాపిత సార్వత్రిక సమ్మెను విజయవంతం చేసేందుకు మంగళవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే సదస్సును జయప్రదం చేయాలనీ ఆయన కోరారు అసంఘటిత కార్మికులకు సోషల్ సెక్యురిటీ కల్పించడానికి వచ్చిన చట్టాలు పిఎఫ్, ఈఎస్ఐలు అమలుకు నోచుకోవడం లేదన్నారు. దేశంలో 40 కోట్ల మంది కార్మికులు వున్నా కాని ప్రావిడెంట్ ఫండ్ (పి.ఎఫ్.) కేవలం 7 కోట్ల మంది కార్మికులకు మాత్రమే అమలు జరగడం సిగ్గుచేటన్నారు. మోడీ అధికారానికి వచ్చిన తర్వాత ఉన్న చట్టాలను తొలగిస్తున్నారని ఆయన విమర్శించారు. దేశంలో ఈపిఎఫ్ పెన్షన్ లబ్దిదారులు 80 లక్షలకు పైగా వున్నా సంవత్సరాల తరబడి పి.ఎఫ్. వాటా చెల్లించి 58 సంవత్సరాల రిటైర్డ్ మెంట్ తర్వాత కనీస పెన్షన్ రూ. 1000 నుండి రూ.2000 లోపు అందడం వలన వృద్ధాప్యంలో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు . కనీసం ఈ.పి.ఎఫ్. పెన్షన్ రూ.9 వేలు వుండాలని, రిటైర్డ్ అయిన వారికి తగిన సామాజిక భద్రత వుండాలని డిమాండ్ చేస్తూ జరిగే కార్మిక సమ్మెకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా కార్పోరేట్లకు అమ్మివేసే చర్యలను నిరసిస్తూ, పేదలకిచ్చే సంక్షేమ పథకాలను ఎత్తివేసే కుట్రలను తిప్పికొట్టాలని, పారిశ్రామికవేత్తలకు కోట్లాది రూపాయల రాయితీలు, బ్యాంకులను లూటీ చేయడానికి అవకాశం కల్పించే మోడీ చర్యలను నిరసిస్తూ మే 20 న జరిగే దేశ వ్యాప్తంగా కార్మిక ఉద్యోగ సార్వత్రిక సమ్మె"ను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బిఓసి జిల్లా అధ్యక్షులు కోల వెంకటన్న, చంద్రన్న, కొండన్న, పెంటన్న ,వెంకటేష్ గౌడ్, వెంకటన్నలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహావిష్కరణకు తరలిరావాలి



సన్నాహక సమావేశానికి హాజరైన ముస్లింలు

**బిజినేపల్లి, ఏప్రిల్ 7 ప్రభాతవార్త :** మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి ముస్లింలు భారీగా తరలిరావాలని మైనారిటీ నాయకులు పిలుపునిచ్చారు. మండలంలోని ఆయా గ్రామాల నుంచి 09 తేదీన మండల కేంద్రంలో నిర్వహించే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్న లక్ష్యంతో బిజినేపల్లి ముస్లిం మైనారిటీ సంఘం ఆధ్వర్యంలో సోమవారం వట్టెం, వెలుగొండ, మంగనూర్, లేటుపల్లి, గౌరారం,గంగారం, మహాదేవుని పేట, వడ్డేమాన్,పాలెం, గుడ్లనర్వ గ్రామాల ముస్లింలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం మైనార్టీల నాయకులు మాట్లాడుతూ కార్యక్రమాలను దిగ్విజయంగా నిర్వహిస్తూ ముస్లిం సమాజం కూడా జాగృతమై ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అన్ని వర్గాలను కలుపుకొని పోతూ ఎస్సీ ఎస్టీ, బీసీ మైనార్టీల హక్కుల సాధన కోసం ఏకతాటిపైకి రావాలనా లక్ష్యంతో ముందుకు పోతున్నట్లు వారు బిజినేపల్లి మండల కేంద్రంలో ఈ నెల 9వ తేదీన నిర్వహించ తలపెట్టిన మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి మండలంలోని ముస్లిం మైనార్టీలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఈ కార్యక్రమాన్ని దిగ్విజయం చేస్తూ ముస్లింల ఐక్యతను చాటాలని వారు సూచించారు. మహమ్మద్ తాజుద్దీన్, మాజీ కోఆప్షన్ సభ్యుడు జహంగీర్,అమీర్ అహ్మద్, ఖాదర్ పాషా,అజీమ్, మైనారిటీ నాయకులు మహ్మద్ గఫూర్, మహమ్మద్ అజీజ్,మహమూద్, మార్కెట్ కమిటీ మెబార్స్ మొహమ్మద్ నసీర్, మహమ్మద్ అయుబ్ తదితరులు పాల్గొన్నారు.

## రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ ప్రమాణ స్వీకారం



రైస్ మిల్లర్స్ నూతన కమిటీని సన్మానిస్తున్న దృశ్యం

**కల్వకుర్తి, ఏప్రిల్ 7 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలోని శుభం ఫంక్షన్ హాల్‌లో ఇటీవలనూతనంగా ఎన్నికైన రైస్ మిల్లర్స్ వెల్ఫేర్అసోసి యేషన్ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు బీచని బాలకృష్ణ, ప్రధాన కార్య దర్శిగా పోల విజయ్ కుమార్, కోశాధికారి యనమనగండ్ల రవిలచే రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు జూలూరి రమేష్ బాబు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు బీచని బాల కృష్ణ మాట్లాడుతూ నా అధ్యక్ష ఎన్నిక సహకరించిన రైస్ మిల్లర్స్ అసోసి యేషన్ సభ్యులకు, సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. అదే విధంగా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అభివృద్ధికి అందరు సహకారంతో అందరిని కలుపుకొని ముందుకు వెళ్ళిపోతానన్నారు. అదేవిధంగా ఉపాధ్యక్షులు పానుగంటి వెంకటేష్, గోవిందు శ్రీనివాసులు, జి భాస్కర్ రెడ్డి, ఇరువెంటి రమేష్, సహయ ఉప కార్యదర్శిలు గుబ్బ ప్రభాక ర్, ఆలంపల్లి కృష్ణ, ఆకుతోట రవి,పోలహరికృష్ణ, ముఖ్య సలహాదారు లుగా జూలూరి రమేష్ బాబు, మాచి పెద్ది రామస్వా మి, గోపిరె డ్డి రాంరెడ్డి,గుబ్బవెంకటేష్,గోవిందుకృష్ణయ్య,సి.రాజశేఖరరెడ్డి, మేడిశెట్టి వేణుగోపాల్, గుండ కృష్ణయ్య లను జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జూలూరి రమేష్ బాబు, ప్రధాన కార్యదర్శి గుడిపల్లి రవి లు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రమేష్ బాబు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు నిబంధనల ప్రకారం నడుచుకోవాలన్నారు. అనంతరం నూతన కమిటీని జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్, తాలూకా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు, బంధు మిత్రులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి నవీన్, పారాబాయిల్డ్ రైస్ మిల్లర్స్ సభ్యులు ప్రతాప్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ జి రాంరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ కొండూరు గోవర్ధన్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు, యజమానులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రథోత్సవం



ఉప్పునుంతలలో ఘనంగా రథోత్సవం

**ఉప్పునుంతల, ఏప్రిల్ 7 ప్రభాతవార్త :** శ్రీరామనవమి పర్వదినం పురస్కరించుకొని మండల కేంద్రమైన ఉప్పునుంతలలో శ్రీ కేదారేశ్వర, చెన్నకేశవ, తేరు ఉత్సాహ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం వేకువజామున రథోత్సవం ఘనంగా జరిగింది. విశేష జన సమూహం మధ్య, చిటికెల భజనతో పాటు మహిళలు బతుకమ్మ సంబరల మధ్య రథోత్సవం (తేరు) శివాలయం నుంచి పోచమ్మ చౌరస్తా వరకు రథోత్స వం యాత్ర కొనసాగింది. అంతకు ముందు తేరు ముందు ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రథోత్సవం భారీ జన సమూహం మధ్య కొనసాగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ, తేరు ఉత్సాహ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**భారీ పోలీసు బందోబస్తు...** రథోత్సవ కార్యక్రమానికి ఎలాంటి సంఘటన చోటుచేసుకోకుండా పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

**అంతరాష్ట్ర వృషభ రాజుల పోటీలు ప్రారంభం...** శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన అంత రాష్ట్ర వృషభ రాజుల (జూనియర్ విభాగం) బండ లాగుడు పోటీలు ప్రారంభించారు. ఈ పోటీల్లో వివిధ ప్రాంతాలు (తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్) నుంచి 11 జతలు పాల్గొన్నాయి. బండ లాగుడు పోటీలు తిలకించేందుకు భారీ సంఖ్యలో గ్రామస్తులు, మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

**పలు వేషధారణతో...**

రథోత్సవం సందర్భంగా భజన పరులు, చిటికె భజన కార్యక్రమం జరిగిన పలువురు పలు వేషధారణతో రథోత్సవ కార్యక్రమానికి హాజరు కావడంతో పలువురిని ఆకర్షించింది. వేషధారణతో పాల్గొని రథోత్సవ కార్యక్రమంలో పాల్గొని పలువురిని ఆకర్షించింది.

## పాఠశాలలను తనిఖీ చేసిన ఎంఈఓ



తరగతి గదిలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈఓ

**లింగాల, ఏప్రిల్ 7 ప్రభాతవార్త:** మండలంలోని ప్రాథమికోన్నత కోమటికుంట, ప్రాథమిక జీల్గుపల్లి, జీల్గుపల్లి తాండ, మాడా పూర్, బాకారం, దత్తారం పాఠశాలలను మండల విద్యాధికారి బషీర్ అహ్మద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని పలు రకాల రికార్డులను పరిశీలించారు. తరగతిగదిలో విద్యార్థుల సామర్థ్యాలను, మధ్యాహ్న భోజనం పరిశీలించారు. కలెక్టర్ ద్వారా వరద ప్రభావిత పాఠశాలలకు వచ్చిన ప్రత్యేక నిధులతో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఉపాధ్యాయులు తప్పనిసరిగా సమయ పాలన పాటించి, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కాంప్లెక్స్ సిఆర్పీలు పాల్గొన్నారు.

## నిరుద్యోగ క్రిస్టియన్ యువతకు ఉచిత శిక్షణ

**గద్వాల, ఏప్రిల్ 7 ప్రభాతవార్త :** గద్వాల జిల్లా నిరుద్యోగ క్రిస్టియన్ యువతకు వివిధ కోర్సులలో శిక్షణ ఇచ్చుటకు గుర్తింపు పొందిన శిక్షణ భాగస్వామ్య సంస్థల నుండి దరఖాస్తుల స్వీకరణ తేదీని ఈ నెల 12వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా మైనారిటీల సంక్షేమ శాఖ అధికారి యం.పి. రమేష్ బాబు ప్రకటనలో తెలిపారు. ట్రైనింగ్ ఎంప్లాయిమెట్, ప్లేస్మెంట్ ప్రోగ్రాం పథకంలో భాగంగా 10వ తరగతి, ఆపై తరగతులు చదివిన క్రిస్టియన్ నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చుట కొరకు ఎన్ఎస్‌డిసి, టిఎస్‌కె, ఈజిఎంఎం, ఎంఈపిఎంఎ, ఎన్ఐ–ఎంఎస్ఎంఈ ద్వారా గుర్తింపు పొందిన శిక్షణ భాగస్వామ్య సంస్థల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తులను మేనేజింగ్ డైరెక్టర్, తెలంగాణ క్రిస్టియన్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్, హైదరాబాద్ గారి కార్యాలయంలో సమర్పించాల్సిందిగా కోరారు. ఇతర వివరాలకు 7013032567 ను సంప్రదించాల్సిందిగా తెలిపారు.

## చలివేంద్రం ప్రారంభించిన తహసీల్దార్



చలివేంద్రం ప్రారంభిస్తున్న దృశ్యం

**నవాబుపేట, ఏప్రిల్ 7 ప్రభాతవార్త :** మండల పరిధిలోని ఎనమనగండ్ల గ్రామ నాయకులు ఎనుమనుగండ్ల ముఖద్వార ప్రాంగణం ప్రభుత్వ జూనియర్ కళాశాల కూడలిలో గల బస్టాండులో మండల అధికారులు తహసిల్దార్ శ్రీనివాస్, ఎన్మన్ గండ్ల గ్రామ ప్రజాప్రతినిధుల సమక్షంలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల తహసిల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో పెరుగుతున్న ఉష్ణోగ్రతల నేపథ్యంలో ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలని కోరారు. ప్రధాన కూడళ్ళలో ప్రజల దాహార్తిని తీర్చేలా చలివేంద్రాలు గ్రామ ప్రజాప్రతినిధులు ఏర్పాటు అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సెక్రటరీ కాంగ్రెస్ నాయకులు హమీద్, మహేష్, యువ నాయకులు బ్యాగరి నర్సింలు, కోసిగి శ్రీనివాసులు, మరికంటి రాజు, చెన్నయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

## గార్లపాడులో చలివేంద్రం ఏర్పాటు

**కోయిలకొండ, ఏప్రిల్ 7 ప్రభాతవార్త :** మండలంలోని గార్లపాడు గ్రామ స్టేజి దగ్గర సోమవారం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి గ్రామ మాజీ సర్పంచ్ దస్తగిరి, మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మల్లికార్జున్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ బాటసారుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయి అన్నారు. గ్రామంలో చలివేంద్రం ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చిన నిర్వాహకులకు వారు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ శ్రీహరి గౌడ్, పంచాయతీరాజ్ డిఈ సురేందర్ రెడ్డి, గోపాల్ ,రాఘవేందర్ రెడ్డి, హనుమంతు, రమేష్, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజ్ పనులు ప్రారంభించిన నాయకులు



**నవాబుపేట, ఏప్రిల్ 7 ప్రభాతవార్త :** మండల పరిధిలోని కాకర్లపాడు గ్రామంలో ప్రజా ప్రతినిధులు గ్రామస్తుల సమక్షంలో ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి సహాయంతో అండర్ డ్రైనేజ్ కాల్వల పనులను కాంగ్రెస్ నాయకులు ఎండి మైనుద్దీన్ కొబ్బరికాయ కొట్టి ప్రజాప్రతినిధుల సమక్షంలో పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు కాంగ్రెస్ నాయకులు ఎండి,మైనుద్దీన్ , కట్టవీరాంజనేయులు, డైరెక్టర్ నర్సింలు, మల్లేష్ చాకలి శీను, దండు ఆనంద్, దండు కుశలయ్య, బక్క నర్సింలు, బండెంకి రవి,దయ్యం గుండ్ల గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి యూత్ బాస్కెట్ బాల్ పోటీలకు ద్రోణదత్త



బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపికైన ద్రోణదత్త

**మహబూబ్‌నగర్, ఏప్రిల్ 7 ప్రభాతవార్త:** ఈనెల 9 నుండి 16వ తేదీ వరకు పాండిచ్చేరి జరిగే 40వ జాతీయస్థాయి యూత్ బాస్కెట్ బాల్ బాలబాలికల ఛాంపియన్ షిప్ పోటీలకు తెలంగాణ రాష్ట్ర యూత్ బాస్కెట్ బాల్ బాలుర జట్టుకు మహబూబ్ నగర్‌కు చెందిన ద్రోణా దత్త ఎంపికైనట్లు మహబూబ్ నగర్ జిల్లా బాస్కెట్ బాల్ సంఘం అధ్యక్ష కార్యదర్శులు మాక్సూద్‌బిన్ అహ్మద్‌జాకీర్, నసురుల్లా హైదర్ తెలిపారు ఈ సందర్భంగా మహబూబ్ నగర్ జిల్లా బాస్కెట్ బాల్ సంఘం ఆధ్వ ర్యంలో ధర్నాదత్తకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భం గా ద్రోణా దత్త మరిన్ని జాతీయ స్థాయి పోటీలలో రాణించాలని ఆకాం క్షించారు. ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ జిల్లా బాస్కెట్ బాల్ సంఘం ఉపాధ్యక్షులు మహమ్మద్ షరీఫ్, కె.శుభాన్ జి సహాయక కార్యదర్శి మహమ్మద్, ఇలియాస్ సీనియర్ క్రీడాకారులు సోహైల్,ఊర్ రెహమాన్‌ఖాన్, ఫారూఖ్ ముకరం పాల్గొని అభినందించారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

**చిన్నచింతకుంట, ఏప్రిల్ 7 ప్రభాతవార్త:** కౌకుంట్ల మండలం ముచ్చింతల గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు మోషే అనారోగ్యంతో మృతి చెందడంతో సోమవారం ఎమ్మెల్యే జి.మధు సూదన్‌రెడ్డి మోషే పార్థివ దేహానికి పూలమాలలు వేసి ఘననివాళులర్పించారు. కుటుంబ సభ్యు లను ఓదార్చి ధైర్యం చెప్పారు. పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని ఎమ్మెల్యే భరోసాను ఇచ్చారు. మృతుడు మోషే ఎల్ఐసి ఏజెంట్ కావడంతో తోటి ఎల్ఐసి ఏజెంట్లు మోషే పార్థివ దేహానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఏజెంట్లు మిత్రబృందం ఆధ్వర్యంలో అంత్యక్రి యలకు రూ.25 వేల కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ఆర్గనైజింగ్ సెక్రెటరీ అరవింద్ కుమార్ రెడ్డి, దేవస్థాన చైర్మన్ గోవర్ధన్ రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ తిరుపతిరెడ్డి, పార్టీ గ్రామ అధ్యక్షులు వెంకటేశ్వర్‌రెడ్డిలతోపాటు ఎల్ఐసి ఏజెంట్లు హనుమంత్‌రెడ్డి, బసిరెడ్డి, ఖాజామైనొద్దిన్, శ్రీనివాస్ గౌడ్‌లు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



**అడ్డాకుల, ఏప్రిల్ 7 ప్రభాతవార్త:** మండల పరిధిలోని పెద్ద మున గల్చేడ్ గ్రామానికి చెందిన రాష్ట్ర వ్యవసాయ రైతు సంక్షేమ కమి షన్ మెంబర్ సెక్రెటరీ ఎం.భవాని రెడ్డి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును సోమవారం నాడు కాంగ్రెస్ నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు తోట శ్రీహరి జిల్లా కిషన్ సేల్ అధ్యక్షులు కె.నాగిరెడ్డి, డిసిసి జిల్లా కార్యదర్శి గంగులవిజయ మోహన్‌రెడ్డి, సంజీవరెడ్డి, వెంకట్ రాములు, సుదర్శన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయ హుండీ లెక్కింపు



ఆలయ హుండీ లెక్కిస్తున్న దృశ్యం

**అడ్డాకుల, ఏప్రిల్7 ప్రభాతవార్త:** మండల పరిధిలోని దక్షిణ కాశీగా పేరుగాంచిన కందూరు గ్రామం లో స్వయంభుగా వెలిసిన శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద సోమవారం హుండీ లెక్కింపు చేపట్టారు. బ్రహ్మోత్సవాలకు ముందు తర్వాత హుండీ లెక్కింపు ఆనవాయితీలో భాగంగా దేవాదాయ ఇన్స్పెక్టర్ వీణాద్రి ఆధ్వర్యంలో లెక్కింపు చేపట్టారు. లెక్కింపులో ఐదు లక్షల రూ. 13,368 సమకూరినట్లు ఆలయ ఈవో రాజేశ్వర శర్మ తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు నాగి రెడ్డి, రవీందర్ శర్మ, దామోదర్ రెడ్డి, శ్రీహరి, నరేందర్ చారి, రాములు, సత్తిరెడ్డి, కొత్త కృష్ణయ్య పాలమూరు యూనివర్సిటీ ఫార్మసీ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇసుకను సీజ్ చేసిన తహసీల్దార్

**ఖిల్లాఘణపురం, ఏప్రిల్7 ప్రభాతవార్త:** మండల పరిధిలోని మామిడి గ్రామంలో అక్రమంగా నిలువచేసిన 42 ట్రాక్టర్ల ఇసుకను సోమవారం సీజ్ చేసినట్లు తహశీల్దార్ సుగుణ తెలిపారు. ఇటీవల మండలంలో అక్రమ ఇసుక రవాణా జోరుగా సాగుతుందని ప్రభుత్వ పనులకు అను మతుల పేరుతో అక్రమార్కులు అక్రమ ఇసుక రవాణాకు తరలిపోరారని తహశీల్దార్ కు ఫిర్యాదు చేశారు. మూడు రోజుల క్రితం మామిడిమడ గ్రామంలో నేరేడు చెరువులో అక్రమంగా ఫిల్టర్ ఇసుకను తయారు చేస్తూ మామిడి మాడతోపాటు చుట్టుపక్కల గ్రామాలలో ఇసుకను అమ్ముతు న్నారు. గ్రామంలో నిర్మిస్తున్న డబల్ బెడ్ రూమ్ ఇండ్లకు సైతం ఫిల్టర్ ఇసుకను వాడుతున్నారని కొందరు గ్రామానికి చెందిన యువకులు ఫిర్యాదు చేశారు. దీంతో తహశీల్దార్ పోలీసు వారు అక్ర మంగా నిల్వచేసిన ఇసుకను గుర్తించి సీజ్ చేశారు. అట్టి ఇసుకను పంచాయతీ కార్యదర్శి పోలీస్ కానిస్టేబుల్, గ్రామ విఆర్ఏ సమక్షంలో వారికి అప్పజెప్పారు. తహశీల్దార్ తో పాటు ఆర్ఐ తిరుపతయ్య పోలీసు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## వృద్ధురాలి సంరక్షణ విషయంలో తగాదాలు

### బాబాయిలు దాడి చేసి కొట్టారని ఫిర్యాదు

**ఖిల్లాఘణపురం, ఏప్రిల్ 7 ప్రభాతవార్త:** మండల పరిధిలోని అప్పారెడ్డిపల్లి గ్రామానికి చెందిన బురాగల్ల శివ వయసు 25 సంవత్సరములు గొర్రెల కాపరి అతని తండ్రి మరణించడంతో వారి నాయనమ్మని సంరక్షణ విషయంలో వారి బాబాయిలతోపాటు విడతలవారీగా చూసుకోవాలని ఒప్పందం చేసుకున్నారు. ఈ విషయమై ఆదివారం ఉదయం ఎనిమిది గంటల ప్రాంతంలో ఆయన బాబాయిలై నబు రుగళ్ల కృష్ణయ్య, రాములు, శివుడు తనతో గొడవపడి దాడికి పాల్ప డ్డారని అదే రోజు రాత్రి 7గంటల 30 నిమిషాల ప్రాంతంలో మళ్లీ మా బాబాయిలతో పాటు వారి భార్యలు శ్యామలమ్మ,అలివేలు, విజయలక్ష్మిలతో కలిసి అందరూ దాడి చేసి కొట్టారని. సోమవారం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదుచేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్ గౌడ్ తెలిపారు.

## గురుకులంలో సీట్లు సాధించిన విద్యార్థులకు సన్మానం





విద్యార్థులను సన్మానిస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

**పెబ్బేరు, ఏప్రిల్ 7 ప్రభాతవార్త:** పెబ్బేరు మండలం వైశాఖాపురం గ్రామం ప్రగతి విద్యాలయంలో 5వ తరగతి గురుకుల ప్రవేశ పరీక్షలు 99 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు సాధించిన విద్యార్థి ఆకాశ్, తోటి విద్యార్థులను పెబ్బేర్ మండల యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎంరాజేష్, అసెంబ్లీ ప్రెసిడెంట్ సాయిరెడ్డి, జిల్లా సెక్రెటరీ శివ, నాయకులు పుట్ట తిరుపతయ్య, డాక్టర్ రంజాన్, జిశివకుమార్,మధు, రమేష్,ఉమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు పరిపూర్ణ ఆరోగ్యం పట్ల అవగాహన కలిగి ఉండాలి

**వనపర్తి క్రైమ్, ఏప్రిల్7 ప్రభాతవార్త:** విద్యార్థులు తమ జీవితంలో ఆరోగ్య శ్రేయస్సు పై అవగాహన కలిగి ఉండాలనిజిల్లా వైద్యాధికారి శ్రీనివాసులు అన్నారు. సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా వనపర్తి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ నర్సింగ్ బాలికల కళాశాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యి మాట్లాడారు. విద్యార్థులు భవిష్యత్‌లో సీజనల్ వ్యాధులు, డెంగ్యూ మల రియా, టైఫాయిడ్‌ల పట్ల దీర్ఘకాలిక వ్యాధులైన టీబీ, క్యాన్సర్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండా లని పేర్కొన్నారు, అంతేగాక డ్రగ్స్,మత్తు పదార్థాల వంటి చెడు వ్యాపకాలకు దూరంగా ఉండాలని తెలియజేశారు. కార్యక్రమంలో భాగంగా జిల్లా ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు, ప్రభుత్వ వైద్య సిబ్బంది జిల్లా న్యాయ సేవాధికార సంస్థ తరుపున పారా లీగల్ వాలంటీర్లు రాజేంద్ర కుమార్, అహ్మద్, కలామ్ పాషా, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.




సదస్సులో మాట్లాడుతున్న వనపర్తి జిల్లా వైద్యాధికారి అల్లే శ్రీనివాసులు

## వడదెబ్బ తగలకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

- చిన్నపిల్లలు, వృద్ధులు అవసరమైన జాగ్రత్తలు పాటించాలి
- మధ్యాహ్నం 12 గంటల నుండి 3 గంటల వరకు బయట ఎవరూ తిరగవద్దు
- ఎండ వేడిని తట్టుకునేందుకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి
- నాగర్‌కర్నూలు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఏప్రిల్7 ప్రభాతవార్త:** వేసవికాలం ప్రారంభమై జిల్లాలో తీవ్ర ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేప థ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ సూచిం చారు. అధిక ఉష్ణోగ్రతల ప్రభావం నుంచి రక్షణ పొందేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరం ఉంటే తప్ప బయటకు వెళ్లకూడదని పేర్కొన్నారు. సోమవారం నాగర్ కర్నూల్ జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం లోని సమావేశ మందిరంలో వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లా ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి జిల్లా అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవసహాయంలతో కలిసి జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వృద్ధులు, చిన్న పిల్లలు ఎండలోకి వెళ్లకుండా చూడాలని సూచించారు. ప్రజలు తరచుగా నీరుతాగాలని, పండ్ల రసాలు ఎక్కువగా తీసుకోవాలని, వృద్ధులు, చిన్న పిల్లలు కాటన్ దుస్తులు ధరించాలని సూచించారు. ఎండలో చెప్పులు వేసుకుని నడవాలని,తువాలు లేదా గొడుగులను ఉపయోగించాలని వివరించారు. మధ్యాహ్నం 12 గంటల నుండి 3 గంటల వరకు వేడి తీవ్రంగా ఉంటుందని, ఆ సమయంలో ప్రయాణాలు నివారించాలని తెలిపారు. అల్కహాల్, టీ,కాఫీ, శీతల పానీయాలను తక్కువగా తీసుకోవాలని, అధిక మాంసకృత్తులు కలిగిన ఆహార పదార్థాలను నివారించాలని సూచించారు. ఎండ కారణంగా అస్వస్థతకు గురైనవారు వెంటనే సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి వైద్య సహాయం పొందాలని సూచించారు. వడదెబ్బలకు తగిన ప్రథమ చికిత్స త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని, ప్రతి ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్సా కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఆరోగ్య కేంద్రా ల్లో అంబులెన్సులు, వైద్య బృందాలు సిద్ధంగా ఉండేలా ఏర్పాట్లు చేయాలని, వడగాల్పుల నేపథ్యంలో ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహించాలని, వైద్య అధికారులను ఆదేశించారు. ప్రతి కార్యాలయంలో తప్పనిసరిగా తాగునీటి వసతి ఏర్పాటు చేయవలెను. ఉపాధి హామీ, క్షేత్రస్థాయిలో పని చేసే సిబ్బందికి, పనుల నిర్వహణ సమయంలో అవసరమైన నీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించాలని తెలిపారు. రైతులు,వ్యవసాయ కూలీలు, ఇండ్ల నిర్మాణం చేసే చోట,పనిచేసే ప్రదేశాలలో తప్పని సరిగా నీడ వసతి ఏర్పాటు చేయాలని తెలియజేశారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యాధికారి స్వరాజ్యలక్ష్మి, కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

### వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



అధికారుల సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

**వనపర్తి టౌన్, ఏప్రిల్ 7 ప్రభాతవార్త:** వరి కోతలు ప్రారంభమైన అన్ని గ్రామ పంచాయతీలు, హ్యాబిటేషన్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశిం చారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు పై సోమవారం సాయంత్రం కలెక్టర్ ఛాంబర్ లో సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులకు పలు సూచనలు చేశారు.వరి కోతలు ప్రారంభమైన అన్ని హ్యాబిటేషన్లలో కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించాలని సూచించారు. కొనుగోలు కేంద్రంలో తేమ యంత్రాలు, తూకం యంత్రాలు, టర్పాలిన్‌లు, గన్ని బ్యాగులు, ధాన్యం శుభ్రం చేసే మిషన్లు లేదా ఫ్యాన్‌లు ఖచ్చితంగా ఉండాలని ఆదేశించారు. కోపరేటివ్ అధికారి, డిఆర్డీఓ, వ్యవసాయ అధికారులు, మార్కె టింగ్ అధికారి కొనుగోలు కేంద్రాలను సందర్శించి కనీస సదుపా యాలు ఉన్నాయా లేవా చూసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో దాదాపు 462 కొనుగోలు కేంద్రాలుఏర్పాటుకు ప్రణాళికలు చేసుకో వాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం జిల్లాలో ఆత్మ కూరు, కొత్తకోట,అమరచింత, మదనపూర్‌లో కొనుగోలు కేంద్రా లు ప్రారంభమయ్యాయి. సేకరించిన ధాన్యాన్ని మిల్లులకు కేటాయించే విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిం చారు. మిల్లును తహసిల్దార్, సివిల్ సప్లై అధికారులు స్వయం గా సందర్శించి మిల్లు సామర్థం, పని చేస్తుందా లేదా అన్ని సదుపాయాలు ఉన్నాయా, బ్యాంక్ డిపాజిట్ వంటి అన్ని చూశాక ధృవీకరణ అనంతరం మాత్రమే మిల్లుకు ధాన్యం కేటాయించాలని ఆదేశించారు. ఎలాంటి పొరపాట్లు జరిగిన ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. యాసంగిలో వనపర్తి జిల్లాలో 148, 596 ఎకరాల్లో వరి సాగు చేయడం జరిగింది. ఇందుకు గాను 4.29 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేయడం జరిగింది. ఇందులో స్థానిక అవసరాలు, నేరుగా మిల్లులకు అమ్ముకోవడం వంటివి పోను దాదాపు 2.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలను రానున్నట్లు తెలిపారు. మొత్తం ధాన్యం కొనుగోలు చేసి సరిగ్గా ఉన్న మిల్లులకు కేటాయింపు పోను మిగిలిన ధాన్యా న్యాన్ని గోదాముల్లో నిక్షిప్తం చేసే విధంగా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సివిల్ సప్లై అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ జి వెంకటేశ్వర్లు, జిల్లా పౌర సరఫరాల అధికారి విశ్వనాథ్, జిల్లా వ్యవసాయ అధికారి గోవింద నాయక్, పిడిడి ఆర్డిఓ ఉమాదేవి, మార్కెటింగ్ అధికారి స్వరణ్ సింగ్, కో ఆపరేటివ్ అధికారి బి.రాణి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలను పాటించాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.ఆర్. సునీత




సదస్సులో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి

**వనపర్తి క్రైమ్, ఏప్రిల్7 ప్రభాతవార్త:** అందరూ ఆరోగ్య సూత్రా లను పాటించాలి అని అనారోగ్యాలకు గురి కావద్దు అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంఆర్ సునీత అన్నారు. సోమవారం వన పర్తి మండల జిల్లా కేంద్రంలోని కన్యకా పరమేశ్వరి కమిటీ హాల్లో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయసేవాధి కార సంస్థ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులకు చట్టాలపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా హాజ రయ్యి మాట్లాడారు. పోషక ఆహార పదార్థాలను అలవాటు పరుచుకోవడం తోపాటు వ్యాయామానికి తగిన సమ యం కేటాయిస్తూ ఆరోగ్యవంతంగా జీవించాలని సూచించారు. కార్య క్రమంలో పాల్గొన్న జిల్లా వైద్య అధికారి అల్లే శ్రీనివాసులు మాట్లాడుతూ. ఆకస్మికంగా హార్ట్ అటాక్ బారినపడిన వ్యక్తికి ఎలా సిపిఆర్ చేయాలో మానవ రూపము కలిగిన బొమ్మకు సిపిఆర్ చేసి చూయించారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా న్యాయ సేవా ధికార సంస్థ జిల్లా కార్యదర్శి వి.రజని మాట్లా డుతూ ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా జరుపుకుంటున్న ఈ కార్య క్రమంలో భాగంగా మనం అందరం కూడా ఈరోజు నుండి అనా రోగ్యం బారిన పడకుండా తగిన జాగ్రత్తలను పాటించాలని సూచించారు. అదేవిధంగా న్యాయ సలహాల కొరకు 15100టోల్ ఫ్రీనెంబర్‌ను సంప్రదించవచ్చు అని తెలియజేశారు. కార్యక్రమం లో మెడికల్ ఆఫీసర్ మంజుల, డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ జి. ఉత్తరయ్య తదితరులు పాల్గొన్నారు.

## సన్న బియ్యం పంపిణీ చేసిన ఎమ్మెల్యే



సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి

**ఉట్కూరు, ఏప్రిల్7 ప్రభాతవార్త :** ఉట్కూరు మండల పరిధిలోని అమీన్పూర్ పగిడిమర్రి గ్రామాలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి బాట కార్యక్రమంలో భాగంగా ప్రతి రేషన్ కార్డుదారునికి సన్నబియ్యం అందించాలనే లక్ష్యంతో,సన్న బియ్యం పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా మక్తల్ శాసనసభ్యులు డా.వాకిటి శ్రీహరి సన్న బియ్యం పంపిణీని అమీన్పూర్, పగిడిమర్రి, గ్రామంలో రేషన్ షాప్ దగ్గర లబ్ధిదారులకుసన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిం చారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ చింత రవి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ జడ్పిటిసి సూర్యప్రకాశ్‌రెడ్డి, నారాయణరెడ్డి, విఘ్నేశ్వర్ రెడ్డి, కుక్క లింగం, మహేష్ రెడ్డి, బసవరాజు గౌడ్, బేమకవిరెడ్డి, శేఖర్ రెడ్డి, రేషన్ డీలర్లు గ్రామ ప్రజల ఆధ్వ ర్యంలో ప్రారంభించడం జరిగింది.

## అంతరాష్ట్ర మహిళా కబడ్డీ విజేతలకు బహుమతులు ప్రదానం

**అయిజ, ఏప్రిల్ 7 ప్రభాతవార్త:** శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని ఈడికొనుపల్లి గ్రామంలో అంతర్రాష్ట్ర మహిళ అన్ ఓపెన్ కబడ్డీ పోటీలు జరిగాయి. ఇందులో భాగంగా ఆదివారం రాత్రి క్రీడలు ముగిసిన అనంతరం గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు ప్రధానం చేశారు. మొదటి బహుమతి 40 వేల రూపాయలు గుజరాత్ టీం కైవసం చేసుకుంది, రెండవ బహుమతి 30 వేల రూపాయలు చిత్తూర్ టీం ,మూడో బహుమతి 20000 తమిళనాడు టీం ,నాలుగో బహుమతి 10000 తిరుపతి టీం, ఐదో గోమతి 5000 రూపాయలు అవేరా టీంలు కైవసం చేసుకున్నాయి. గెలుపొందిన విజేతలకు గ్రామస్తుల ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బడే సాబ్ యాదవ్, వెంకన్న యాదవ్, ఉరుకుందు, బోయిని వెంకట్రాములు, గంగన్న, నాగేష్ యాదవ్ ,రామాంజనేయులు, నరేష్, పల్లేష్ పరమేష్, వెంకటేష్, పొట్టెప్ప, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

## యువతకు జీవనోపాధి కల్పించడమే లక్ష్యం



యువతకు జీవనోపాధిపై అవగాహన కల్పిస్తున్న ఎస్సీ కార్పొరేషన్ ఈడి రామ్ లాల్, ఎంపిడిఓ చంద్రశేఖర్

**లింగాల, ఏప్రిల్7 ప్రభాతవార్త:** యువతకు జీవనోపాధి కల్పిం చడం కోసమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని అందుకే రాజీవ్ యువ వికాసం పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ పథకాన్ని ఏర్పాటు చేశారని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రామ్‌లాల్, ఎంపీడీవో చంద్రశేఖర్ అన్నారు, సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడి వో కార్యాలయంలో రాజీవ్ యువ వికాసం పథకంపై పంచా యతీ కార్యదర్శులకు,ఆయా గ్రామాల యువకులకు ఎంపీ డీవో చంద్రశేఖర్ అధ్యక్షతన అవగాహన సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రూ.50 వేల నుంచి నాలుగు లక్షల రూపాయల వరకు స్వయం ఉపాధి పథకం కోసం ఈ పథకాన్ని ఏర్పాటు చేసిందని, నిరు ద్యోగులు, యువకులు ఎస్సీ,ఎస్టీబీసీ, మైనార్టీలు ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలని వారు కోరారు. ఈనెల 14వరకు దరఖా స్తులను ఎంపీడీవో కార్యాలయంలో సమర్పించాలని సూచిం చారు. ఆన్లైన్ దరఖాస్తు నమోదు కాకపోయినను మీరు దరఖాస్తు పూర్తి చేసి వాటికి తగిన సర్టిఫికెట్స్ జతపరచి మండల కార్యా లయము నందు సమర్పించాలని కోరారు. ఇప్పటి వరకు రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తులు బిసి 108, ఎస్సీ 41, ఎస్టీ 94, ఈబిసి02, మొత్తం 245 దరఖాస్తులు స్వీకరించినట్లు ఎంపిడిఓ చంద్రశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్‌తో పాటు ఎంపీఓ సురేందర్, గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, గ్రామాల యువకులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

**నారాయణపేట టౌన్, ఏప్రిల్7 ప్రభాతవార్త:** నారాయణపేట శాసనసభ్యురాలు చిట్టెం పర్ణిక రెడ్డి చేతుల మీదుగా సోమవారం నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే పర్ణిక రెడ్డి అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలో అన్ని వర్గాల వారికి న్యాయం చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా, వివిధ మండలాల నాయకులు ఉన్నారు.

## సలేశ్వరం జాతరకు పకడ్బందీగా ఏర్పాట్లు

మొదటి పేజీ తరువాయి భాగం..

చేయాలని, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని, జిల్లా పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో జాతరలో ఎప్పటికప్పుడు శానిటే షన్ పనులను నిర్వహించడంతో పాటు ఎక్కడ కూడా అపరి శుభ్రత లేకుండా అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. ట్రాఫిక్, బందోబస్తు, ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని పోలీసు లు తమ విధులు సక్రమంగా నిర్వహించి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కలెక్టర్ తెలిపారు. భక్తులకు త్రాగునీటి సౌకర్యాన్ని కల్పించాలని ఆర్‌డబ్ల్యూఎస్, అధికారులను ఆదేశిం చారు. సలేశ్వరం జాతరకు జిల్లాతో పాటు ఆయా ప్రాంతాల నుంచి భక్తులు ఎక్కువగా వస్తారని ప్రజలకు సరిపడ రవాణా సదుపాయం కల్పించాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. సలేశ్వరం జాతరకు భక్తులకు ఎక్కువగా వచ్చే అవకాశమున్నం దున అందుకు అవసరమైన ఏర్పాట్లు ఇప్పటి నుంచే చేయాలని కలెక్టర్ సూచించారు. సలేశ్వరం జాతర సమయంలో ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, ప్రమాదాలు జరగకుండా అగ్నిమాపక సిబ్బందితో పాటు ఫైరింజన్ను అందుబాటులో ఉంచా లని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లా అటవీ అధికారులు సరైన రోడ్డు సౌకర్యం కల్పించాలని,మూడు రోజుల పాటు జరుగునున్న జాతరలోసోలార్ లైట్లు ఏర్పాటు చేయాలని డిటిడ బ్ల్యూఓ అధికారులను ఆదేశించారు. గత ఏడాది అనుభవాలను దృష్టిలో ఉంచుకొని సరైనా చర్యలు చేపట్టాలని ఐటిడిఎ అధికా రులను ఆదేశించారు. అచ్చంపేట ఆర్డీవో సలేశ్వరం జాతర నోడల్ అధికారిగా పని చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ వివరించారు.

## నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తాం

మొదటి పేజీ తరువాయి భాగం..

నిర్మించనున్నారని, అద్దె భవనాల్లో కొనసాగుతున్న ప్రభుత్వ కార్యాలయ లక్ష్యంతో సొంత భవనాలను ఏర్పాటు చేస్తామని ఆయన అన్నారు. ప్రతి నిరుపేద సైతం సంపన్నులు తినే భోజ నాన్ని తినాలన్న ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టా త్మకంగా సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిందని ప్రతి ఒక్కరు రేషన్ షాపుల ద్వారా అందించే సన్నబియ్యాన్ని పొందా లని ఏదైనా సమస్య ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు ఉత్తమ విద్యను అందించేందుకుఇంటర్నేషనల్ ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషనల్ హబ్బు లతో పాటు, మండలానికో అధునాతన పాఠశాలలను నిర్మించబో తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వనపర్తి నియోజకవర్గ పరిధిలోని కాంగ్రెస్‌పార్టీ జిల్లా నాయకులు, మండల నాయకులు ఆయా గ్రామాల నాయకులు, పార్టీ శ్రేణులు, పెద్దలు కళ్యాణలక్ష్మి,షాదిముబారక్, సిఎంఆర్ఎఫ్ లబ్ధిదారులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఫిర్యాదులను వేగంగా పరిష్కరించాలి

మొదటి పేజీ తరువాయి భాగం..

అన్ని మండలాల తహసీల్దార్లు రేషన్ షాపుల్లో సన్న బియ్యం పంపిణీ పై పర్యవేక్షణ ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. ఎక్కడా దొడ్డు బియ్యం, సన్న బియ్యం కలిపి పంపిణీ చేయవద్దని సూచిం చారు. అలాంటి పనులు ఎక్కడైనా చేసినట్లు తీరితే చర్యలు తీసు కోవడం జరుగుతుందని సదరు రేషన్ షాపు డీలర్ లైసెన్స్ క్యాన్సిల్ చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. తాసిల్దార్లు తప్పకుండారేషన్ షాపులను విజిట్ చేసి తనిఖీలు చేయాలన్నారు. అదేవిధంగా మరికొద్ది రోజుల్లో వరి ధాన్యం కొనుగోలు ప్రారంభం కాబోతోందని, దాన్ని కొనుగోలు కేంద్రాలను కూడా తహసిల్దారులు సందర్శించి పర్యవేక్షణ ఉంచాలన్నారు. అదేవిధంగా కొత్త రేషన్ కార్డుల ఎంక్వయిరీ ప్రక్రియ కూడా త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా బీసీని ప్రకటించాలి

**మహబూబ్‌నగర్ ఏప్రిల్7 ప్రభాతవార్త:** పాలమూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా బీసీని ప్రకటించాలని బీసీ సమాజ్ ఉమ్మడి పాలమూరు జిల్లా అధ్యక్షుడు రాష్ట్ర కార్యదర్శి ఎం. శ్రీనివాస్ సాగర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశాడు. ఉమ్మడి జిల్లా వ్యాప్తం గా కాంగ్రెస్ పార్టీలో కార్పొరేషన్ చైర్మన్‌ల పదవుల్లో గాని నామి నేటెడ్ పోస్టులో గాని ఇతర ప్రాధాన్యత గల పోస్టుల్లో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఇటీవల ప్రకటించిన రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పోస్టుల్లో కూడా బీసీలకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి తీవ్ర నిరాశనే మిగిలిందన్నారు. కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని మొదటినుంచి పార్టీలు మారకుండా ఉంటూ పార్టీ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటూ కాంగ్రెస్ పార్టీ గెలుపులో తన వంతు పాత్రను పోషించిన సంజీవ్ ముదిరాజ్‌కు అధ్యక్ష పదవికి అర్హుడని అదేవిధంగా న్యాయవాదిగా, కాంగ్రెస్ పార్టీలో ఉంటున్నమరోబీసీనాయకుడు ఎన్‌పి.వెంకటేష్ కూడా అధ్యక్షునిగా అన్నిఅర్హతలు ఉన్నాయని ఆదిశగా ప్రభుత్వం ఆలోచించాలన్నారు.


## ఫిర్యాదులను పెండింగ్ పెట్టొద్దు

మొదటి పేజీ తరువాయి భాగం..

ఆదేశించారు. రేషన్ షాప్‌ల ద్వారా ప్రభుత్వం పేద కుటుంబాల కార్డ్ దారులకు సన్నబియ్యం సరఫరా చేస్తుందని, మండల ప్రత్యేక అధికారులు రేషన్ షాపులను పర్యవేక్షించాలని, లబ్ధిదా రులతో మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకోవాలని, దొడ్డు బియ్యం బదులు సన్న బియ్యం సరఫరా చేస్తున్నందున పేదలు పూర్తిగా సద్వినియోగం చేసుకునేలా చూడాలని అన్నారు. దిశ సమావేశం ఈనెల 16న మహబూబ్ నగర్ ఎం.పి అధ్యక్షతన నిర్వహించనున్నందున కేంద్ర పథకాలు అమలు పై ఆయా శాఖలు పథకాలు ప్రగతి పై నోట్స్ అంద చేయాలని సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.కె.కృష్ణ ప్రపంచ ఆరోగ్య దినోత్స వం సందర్భంగా మాట్లాడుతూ ఈ సంవత్సరం ఆరోగ్యకర ఆరంభం ఆశాజనక భవిష్యత్ అనే అంశం పై నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తల్లి గర్భంలో పుట్ట బోయే శిశువు నుండి శిశువు పుట్టే వరకు తల్లి,శిశువు ఆరోగ్యం పై శ్రద్ధ పెట్టాలని, మాతృ శిశు మరణాలను నివారించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్‌మోహన్ రావు,జడ్.పి.సి.ఈ.ఓ వెంకటరెడ్డి, డి.అర్.డి.ఓ నర్సింహులు,అర్.డి. ఓ నవీన్ పాల్గొన్నారు

## ప్రజలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలి

**ఇటిక్యాల, ఏప్రిల్ 7 ప్రభాతవార్త:** ప్రజలు ఆరోగ్యం పట్ల పూర్తి శ్రద్ధ వహించాలని వేసవికాలంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఇటిక్యాల ప్రభుత్వ ఆసుపత్రి డా. రాధిక ప్రజలకు సూచించారు. సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఆరోగ్యం పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ డా.మూబీనా తబసుమ్, ఎంఎల్‌హెచ్‌పి డా. అనిరుద్. పిహెచ్ఎన్ సత్యమ్మ, స్టాఫ్ నర్స్ శోభ, వైద్య సిబ్బంది ప్రభాకర్, పరుశురాం, భారతి, ధనలక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.




ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా అవగాహన కల్పిస్తున్న డాక్టర్, సిబ్బంది

# దేశంలో బలమైన పార్టీగా బిజెపి ఎదిగింది

■ జోగులాంబ జిల్లా నూతన బిజెపి అధ్యక్షులు రామాంజనేయులు
■ షాబాద్, వేములలో బిజెపి జెండా ఆవిష్కరణ



షాబాద్‌లో



వేములలో

**ఇటిక్యాల, ఏప్రిల్7 ప్రభాతవార్త:** దేశంలో 45 సంవత్సరాల క్రితం ఆవిర్భవించిన బిజెపి పార్టీ ఎంతో బలమైన పార్టీగా ఎదిగిందని సొంతంగా 15 రాష్ట్రాలలో బిజెపి పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వాలు కొనసాగుతున్నాయనిజోగులాంబ జిల్లానూతన బిజెపి పార్టీ అధ్యక్షులు రామాంజనేయులు అన్నారు. సోమవారం సాయంత్రం మండల పరిధిలోని షాబాద్ గ్రామంలో మండల బిజెపి పార్టీ అధ్యక్షులు అబ్దుల్లా ఆధ్వర్యంలో జిల్లా బిజెపి పార్టీ నూతన అధ్యక్షులు రామాంజనేయులు హాజరై బిజెపి పార్టీ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని బిజెపి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2 ఎంపీ సీట్లతో ప్రారంభమై నేడు దేశంలో మూడుసార్లు బిజెపి పార్టీ అధికారంలోకి వచ్చిందని 15 రాష్ట్రాల్లో సొంతంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిందని అలాగే 6 రాష్ట్రాల్లో మిత్రపక్షంగా ఉందని ఆయన గుర్తు చేశారు. ఈ సందర్భంగా జిల్లా బిజెపి పార్టీ నూతన అధ్యక్షులు రామాంజనేయులును మండల పార్టీ అధ్యక్షులు అబ్దుల్లా సత్కరించారు. అదేవిధంగా వేముల గ్రామంలో ఎర్రవల్లి మండల బిజెపి పార్టీ అధ్యక్షులు జగదీశ్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావం సందర్భంగా బిజెపి పార్టీ జెండాను ఆవిష్కరించారు.

## వల్లూరులో సన్న బియ్యం పంపిణీ

◆ కేంద్ర ప్రభుత్వం 5 కేజీలు, రాష్ట్ర ప్రభుత్వం ఒక కేజీ బియ్యం మాత్రమే పంపిణీ చేస్తుంది
◆ జోగులాంబ జిల్లా బిజెపి నూతన అధ్యక్షులు రామాంజనేయులు



వల్లూరులో సన్న బియ్యం పంపిణీ చేస్తున్న జిల్లా బిజెపి నూతన అధ్యక్షులు రామాంజనేయులు, బిజెపి నాయకులు

**ఇటిక్యాల, ఏప్రిల్ 7 ప్రభాతవార్త:** కేంద్ర బిజెపి ప్రభుత్వం తెల్ల కార్డు దారులకు ఒక్కొక్కరికి 5 కేజీల చొప్పున పంపిణీ చేస్తుండగా రాష్ట్ర ప్రభుత్వం కేవలం ఒక్క కేజీ మాత్రమే పంపిణీ చేస్తుం దని జిల్లా నూతన బిజెపి పార్టీ అధ్యక్షులు రామాంజనేయులు ప్రజలకు వివరించారు. సోమవారం మండల పరిధిలోని వల్లూరు గ్రామంలో తెల్లకార్డుదారులకు మండల బిజెపి పార్టీ అధ్యక్షులు జగదీశ్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు కేకే రెడ్డిలతో కలిసి సన్న బియ్యాన్ని ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గరీబ్ కళ్యాణ్ అన్న యోజన పథకంలో భాగంగా ఉచిత సన్న బియ్యం పథకం కింద 5 కేజీల బియ్యం ప్రతి వ్యక్తికి ఇస్తున్నారని బియ్యానికి రూ. 40 కేంద్ర ప్రభుత్తం ఇస్తుందని అదే విధంగా ప్రతి రేషన్ షాప్‌లో నరేంద్ర మోడీ ఫోటో పెట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట ప్రభుత్తం 1 బియ్యం ఇస్తూ మేము మొత్తం ఇస్తునట్టు ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు శ్రీనివా సరెడ్డి, బూత్ అధ్యక్షులు ప్రభాకరరెడ్డి, రాజు పాల్గొన్నారు.

వేములలో బిజెపి జెండా ఆవిష్కరణ: మండల పరిధిలోని వేముల గ్రామంలో బిజెపి పార్టీ 45వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండల బిజెపి పార్టీ అధ్యక్షులు జగదీశ్ రెడ్డి ఆధ్వర్యంలో బిజెపి పార్టీ జెండాను వారు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి జనార్ధన్, రామ్ రెడ్డి పోలింగ్ బూత్ అధ్యక్షులు శివ, నవీన్, ఉదయ్, పరుష రామ్, యశ్వంత్, ఎర్రన్న, చరణ్, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

## బీసీ డీ నుండి బిసి ఏలోకి చేర్పించడంతోనే ముదిరాజ్‌లకు మంచి రోజులు సాధ్యం

■ మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

**నారాయణపేట టౌన్, ఏప్రిల్ 7 ప్రభాతవార్త:** ముదిరాజ్ కులాన్ని బీసీ డీ గ్రూప్ నుండి బీసీ ఏ గ్రూప్‌లోకి చేర్పించడంతోనే మంచి రోజులు సాధ్యమనిపిల్లల భవిష్యత్తు మారుతుందని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. సోమవారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని పోలేపల్లి ఫంక్షన్ హాల్లో జరిగిన నారాయణపేట జిల్లా మత్స్య సహకార సంఘం జిల్లా విస్తృతస్థాయి సమావేశంజరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మక్తల్ ఎమ్మెల్యే వాకిటిశ్రీహరి, పేట ఎమ్మెల్యే పర్ణికరెడ్డి, మాజీ డిసిసి అధ్యక్షులు అధ్యక్షులు కుంభం శివకుమార్ రెడ్డి హాజరయ్యారు. కార్య క్రమాన్ని ఉద్దేశించి మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మాట్లాడుతూ ముదిరాజ్ కులం బాగుపడాలన్న బీసీ డీ గ్రూప్‌నుండి బీసీఏ గ్రూప్‌లోకి చేర్పించ దంతోనే ముదిరాజుల జీవితం పిల్లల భవిష్యత్తు మారుతుందన్నారు. ముదిరాజ్ కులం ఎవరిని మోసం చేసే జాతి కాదని కష్టాన్ని నమ్ముకుని బతికే కులం అన్నారు. ముదిరాజుల వృత్తి చేపల అన్నారు. ఈ ప్రాంతంలో నీటి సౌకర్యం లేని కారణంగా ముదిరాజ్ సర్టిఫికెట్లు పొందలేకపోయామన్నారు. నారాయణపేట కోడంగల్ ఎత్తిపోతల పథకం ద్వారా ఈ ప్రాంతానికి మంచి రోజులు రాబోతున్నాయని ముదిరాజుల తలరాతలు మారుతాయి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ముదిరాజ్‌ల సంక్షేమంకోసం అందజేస్తున్న ప్రతిపథకాన్ని సద్విని యోగం చేసుకోవాలన్నారు. ముదిరాజ్ అంతా ఐక్యంగా ఉండి ఒకరు సహాయ సహకారాలు అందజేసుకుంటూ అన్ని రంగాల్లో ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార సంఘం జిల్లా అధ్యక్షులు ఏ.కాంత్ కుమార్, రాష్ట్ర, జిల్లా మత్స్యకార సంఘం నాయకులు, మార్కెట్ కమిటీ చైర్మన్ శివారెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ హనుమంతు, శరబ్ నాగరాజు, దామరగిద్ద పిఎసిఎస్ అధ్యక్షులు పుట్టి ఈదప్ప, మోనాపురం నర్సిములు, నియోజకవర్గంలోని ఆయా మండలాల మత్స్యకారసంఘం నాయకులు పాల్గొన్నారు.

## పీయూ రిజిస్ట్రార్‌గా పూస రమేష్ బాబు

◆ ఆన్‌లైన్ ప్రవేశ పరీక్ష ఏర్పాటులో కీలకభూమిక
◆ మూడు అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌లకు కన్వీనర్‌గా విధులు
◆ నూతన రిజిస్ట్రార్‌కు ఘనస్వాగతం పలికిన వీసీ శ్రీనివాస్



రిజిస్ట్రార్‌ను సన్మానిస్తున్న వీసీ శ్రీనివాస్, ఇన్‌చార్జి రిజిస్ట్రార్

**మహబూబ్‌నగర్‌బ్యూరో, ఏప్రిల్7, ప్రభాతవార్త:** పాలమూరు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ రమేష్ బాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమేరకు ఉపకులపతి ఆచార్య జిఎన్ శ్రీనివాస్, ఇన్చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి ఆయనకు ఘనస్వాగతం పలికారు. రమేష్ బాబు తల్లిదండ్రులు పీవీఈశ్వరయ్య, కమలమ్మ. వారి స్వస్థలం హైదరాబాద్‌లోని కంటోన్మెంట్ బొల్లారం.


**విద్యాభ్యాసం :** రామంతాపూర్‌లో గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజీలో డిప్లొమా, ఆంధ్ర యూనివర్సిటీలో బిఈ, మెకానికల్ ఇంజనీరింగ్ జేఎన్టీయూహెచ్‌లో, పీహెచ్డీ ఐఐటీ ఖరగ్‌పూర్‌లో పూర్తి చేశారు.

**ఉద్యోగ ప్రస్థానం :** 1997లో ఓయూ మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం లో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా నియామకమయ్యారు. ప్రస్తుతం అదే విభాగంలో సీనియర్ ప్రొఫెసర్ గా కొనసాగుతున్నారు. పరిపాలన అనుభవం మెకానికల్ ఇంజనీరింగ్ లో విభాగాధిపతిగా, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా ఓయూలో చేశారు. తెలంగాణ రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా ఆన్‌లైన్ ప్రవేశ పరీక్షలను ప్రవేశపెట్టదంలో కీలక భూమిక వహించారు. తెలంగాణ రాష్ట్రంలో ఐదేండ్లు వివిధ సెట్ ల నిర్వహణ కు అడ్మిషన్స్ కన్వీనర్‌గా పనిచేశారు. ఉస్మానియా యూనివర్సిటీలో అదనపు పరీక్షల నియంత్రణ అధికారిగా పని చేశారు.

**పరిశోధన అనుభవం :** మూడు ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ కి కన్వీనర్ గా, ఇస్తాం (ఐఎస్‌టీఏఎం) అనే సొసైటీ, ఐఐటి ఖర్గపూర్ కు వైస్ ప్రెసిడెంట్ గా, దేశ విదేశాలలో పరిశోధన పత్రాల సమర్పణ చేశారు.

**రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలుపుతాం..**

పీయూ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం రిజిస్ట్రార్ రమేశ్‌బాబు మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి సొంత జిల్లాకు రిజిస్ట్రార్‌గా రావడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. వీసీ ఆచార్య జి ఎన్ శ్రీనివాస్ సహకారంతో పాలమూరు యూనివర్సిటీ ని తెలంగాణ రాష్ట్రంలో సాంకేతికంగా అగ్రగామిగా నిలపడానికి కృషి చేస్తానన్నారు. బోధన సిబ్బంది సహకారం తో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి కృషి చేస్తానని అన్నారు.



రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపడుతున్న రమేశ్‌బాబు

## ఏడాది దాటినా.. పనులు ప్రారంభం కాలె..!

◆ మహబూబ్‌నగర్ కోర్టు రోడ్డుకు గ్రహణం ◆ టెండర్ దక్కించుకున్న అమ్మ కన్స్ట్రక్షన్స్
◆ రూ.3.20 కోట్ల నిధులు మంజూరు ◆ పనుల ప్రారంభంలో తీవ్ర జాప్యం
◆ అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం



అధ్వానంగా కోర్టు రోడ్డు దుస్థితి

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఏప్రిల్ 7 ప్రభాత వార్త:** మహబూబ్‌నగర్ నడిబొడ్డున..నిత్యం జిల్లా అధికారులు ప్రయాణం సాగించే రోడ్డు నిర్మాణానికి గ్రహణం పట్టింది. ఏడాది కిందటే టెండర్లు పూర్తయిన నిధులు కూడా మంజూరైన పనులు మాత్రం ప్రారంభం కావడం లేదు. ఒక్క చిన్న రాయి కూడా తీసి పక్కకు పెట్టలేదు. అదే గుంతల రోడ్డులో అలాగే ప్రయాణాలు సాగిస్తున్నారు..అదీ కోర్టు రోడ్డు పరిస్థితి. వివరాల్లోకి వెళ్తే మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తా నుంచి కోర్టు మీదుగా కలెక్టర్ బంగ్లా వరకు నిత్యం వేలాది గా వాహనాలు జనాలు ప్రయా ణం సాగిస్తుంటారు. అదీ కాక జిల్లా అత్యున్నత స్థాయి అధికారులైన జిల్లా మెజిస్ట్రేట్, కలెక్టర్, జిల్లా జడ్జి కూడా ఇదే దారిలో నిత్యం ప్రయాణం సాగిస్తుండడం విశేషం. అయినా కూడా కనీసం రోడ్డు పనులు ప్రారంభం కాకపోవడం పై సర్వత్ర చర్చనీయాంశమైంది. కోర్టు రోడ్డు వీటి నిర్మాణానికి సంబంధించి సుమారు మూడు కోట్ల 20 లక్షల రూపాయలు మంజూరైనట్లు అధికారుల ద్వారా తెలిసింది. టెండర్లు కూడా పూర్తయి దాదాపు సంవత్సరం నర అవుతున్నది. అయినా కూడా కాంట్రాక్ట దక్కించుకున్న అమ్మ కన్స్ట్రక్షన్స్ కాంట్రాక్టర్ శివానంద స్వామి పనులు నేటికీ ప్రారంభించలేదు. ఇదే విషయమై గతంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్ అడిషనల్ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్‌కు ఫిర్యాదు కూడా చేసినట్లు తెలిపారు. కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్టులో పెట్టాలని సూచించినట్లు సమాచారం. అయినప్పటికీ స్పందన లేకపోవడం గమనార్హం. నిత్యం రద్దీ కారణంగా మరింత గుంతలు ఏర్పడుతున్నాయి. రాత్రి వేళ అదుపుతప్పి ప్రయాణికులు కింద పడే పరిస్థితి లేకపోలేదు. టెండరు ప్రక్రియ పూర్తయి నిధులు మంజూరైనా పనులు ప్రారంభానికి నోచుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పట్టణం లోని మారుమూల వార్డులో సీసీ రోడ్లు, బీటీ రోడ్లు వేస్తున్నారు.. జనసంచారం ఉండే మహ బూబ్‌నగర్‌పట్టణంలోని అత్యంత రద్దీ రోడ్లలో ఒక్కటైన కోర్టు రోడ్డు పనులు ఎందుకు ప్రారంభం కావడం లేదని ఆశ్చర్యానికి గురవతున్నారు. స్థానిక ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి మహబూబ్‌నగర్ అభివృద్ధిపై ప్రత్యేక ఫోకస్ పెట్టిన సంగతి తెలిసిందే. విద్యా వైద్యం ఉపాధి మూడురంగాలపై ఆయన ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. ఈ క్రమంలో పట్టణం నడి బొడ్డున రోడ్డు పరిస్థితి పై కూడా స్పందించి శ్రద్ధ తీసుకొని పనులు పూర్తయ్యేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

"అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని" అన్న చందంగా తయారయింది మహబూబ్‌నగర్ కోర్టు రోడ్డు పరిస్థితి. టెండర్లు పూర్తయిన నిధులు రెడీగా ఉన్నా కనీసం పనులు ప్రారంభించకపోవడం పై సర్వత్రా విమర్శలకు దారితీస్తున్నది.అసలు పనులు ప్రారంభించకపోవడానికి గల కారణాలు ఏంటి అని చర్చనీయాంశమైంది.



కోర్టు రోడ్డులో గుంతలు ఏర్పడిన దృశ్యం



## ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవ వేడుకలు

**నారాయణపేట టౌన్, ఏప్రిల్ 7 ప్రభాతవార్త :** ప్రతి గ్రామంలో వైద్య సేవలు అందాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. సోమవారం మండలంలోని అప్పక్‌పల్లి వద్ద గల ప్రభుత్వ వైద్య కళాశాలలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వైద్య కళాశాల ప్రిన్సిపల్ డా. రామ్ కిషన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి కలెక్టర్‌తో పాటు కాళోజి యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ డా. నందకుమార్ రెడ్డి, ఎమ్మెల్యే చిట్టెం పర్ణికా రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైద్య కళాశాల విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే చిట్టెం పర్ణికా రెడ్డి మాట్లాడుతూ మెడికల్ కాలేజీలో ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఒకే సంవత్సరంలో ఎంబీబీఎస్, నర్సింగ్, పారా మెడికల్ కాలేజీని ప్రారంభించామని చెప్పారు. త్వరలో మదర్ అండ్ చైల్డ్ హెల్త్ సెంటర్‌ను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. వైస్ ఛాన్స్‌లర్ డాక్టర్ నంద కుమార్ మాట్లాడుతూ నారాయణపేట మెడికల్ కాలేజీ పురోగతిలో ఉందని, కళాశాలకు అవసరమైన నిధులను మంజూరు చేస్తామని, లైబ్రరీకి అవసరమైన 4 వేల పుస్తకాలను పంపిస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పర్యావరణవేత్త కే.పురుషోత్తం రెడ్డి పద్మశ్రీ అవార్డు గ్రహీత డా. దాసరి ప్రసాద్ రావు, డాక్టర్ విజయ్ సీనియర్ జర్నలిస్టు పంతంగి రాంబాబు, సామాజిక వేత్త కుంభం శివకుమార్ రెడ్డి, మార్కెట్ చైర్మన్ శివారెడ్డి , రెడ్ క్రాస్ చైర్మన్ సుదర్శన్ రెడ్డి, వైద్య నిపుణులు ఆదిత్య, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తాపట్నాయక్

## ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులను వేగంగా పరిష్కరించాలి

◆ వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



ప్రజల నుండి ప్రజావాణి అర్జీలను స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్

**వనపర్తి, ఏప్రిల్ 7 ప్రభాతవార్త:** ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో అదనప కలెక్టర్ రెవెన్యూ జి.వెంకటేశ్వర్లు, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య, ఆర్డీవో సుబ్రహ్మణ్యంతో కలిసి ప్రజల నుంచి అదనపు కలెక్టర్ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ, ఫిర్యాదుదారులకు తగిన సమాచారం అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ముఖ్యమంత్రి ప్రజావాణి, మంత్రి ద్వారా ఈ జిల్లాకు సంబంధించిన ప్రజావాణి ఫిర్యాదులు, జిల్లా ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణికి మొత్తం 30 ఫిర్యాదులు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. తహసిల్దార్లు రేషన్ షాపులను తనిఖీ చేయాలి జిల్లాలోని అన్ని మండలాల తహసీల్దార్లు రేషన్ షాపుల్లో సన్న బియ్యం పంపిణీ పై పర్యవేక్షణ ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. ఎక్కడా దొడ్డు బియ్యం, సన్న బియ్యం కలిపి పంపిణీ చేయవద్దని సూచించారు. అలాంటి పనులు ఎక్కడైనా చేసినట్లు తీరితే చర్యలు తీసుకోవడం జరుగుతుందని సదరు రేషన్ షాపు డీలర్ లైసెన్స్ క్యాన్సిల్ చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. తాసిల్దార్లు తప్పకుండా రేషన్ షాపులను విజిట్ చేసి తనిఖీలు చేయాలన్నారు. అదేవిధంగా మరికొద్ది రోజుల్లో వరి ధాన్యం కొనుగోలు ప్రారంభం కాబోతోందని, దాన్ని కొనుగోలు కేంద్రాలను కూడా తహసిల్దారులు సందర్శించి పర్యవేక్షణ ఉంచాలన్నారు. అదేవిధంగా కొత్త రేషన్ కార్డులఎంక్వయిరీ ప్రక్రియ కూడా త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ విధానం

◆ కాంగ్రెస్ నాయకులు జూపల్లి అరుణ్ కుమార్



సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి జూపల్లి తనయుడు అరుణ్ కుమార్‌రావు

**చిన్నంబావి, ఏప్రిల్ 7 ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రజా అవసరాలు గుర్తించి వారికి కావలసిన సంక్షేమ పథకాలు అందించడంలో కాంగ్రెస్ పార్టీ ముందంజలో ఉంటుందని ఇది ముమ్మాటికి ప్రజా పాలన కోరుకునే కాంగ్రెస్ పార్టీ విధానమని మంత్రి జూపల్లి తనయుడు జూపల్లి అరుణ్ కుమార్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని పలు గ్రామాలలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమంలో భాగంగా పెద్ద దగడ గ్రామానికి విచ్చేసిన ఆయన ఇటీవల మృతి చెందిన పల్లె నారాయణరెడ్డి కుటుంబాన్ని పరామర్శించి అనంతరం తహసిల్దార్ ఇక్బాల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నిరుపేదలకు రేషన్ కార్డుల ద్వారా సన్న బియ్యం కార్యక్రమం కొనసాగిస్తుందని అలాగే నూతన రేషన్ కార్డుల మంజూరు సైతం కొనసాగిస్తుందని, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం నిరుపేదలకు అండగా నిలిచిందని ఆయన అన్నారు. సోమవారం మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో లక్ష్మీపల్లి, కొప్పునూరు, వెలగొండ, వెల్టూరు, పెద్దమారు గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రామచంద్రారెడ్డి, కొత్త కళ్యాణ్ రావు, కృష్ణ ప్రసాద్ యాదవ్, శ్రీలతరెడ్డి, నరసింహారెడ్డి, బీచ్‌పల్లి యాదవ్‌లు సన్న బియ్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు తహసిల్దార్ ఇక్బాల్, డిప్యూటీ తహసిల్దార్ శ్రీనివాస్, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ రాములు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు చంద్రశేఖర్ యాదవ్, యూత్ కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్, మాజీ సర్పంచులు, మాజీ ఎంపిటిసిలు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వేణుగోపాల స్వామి వారి రథోత్సవం

**కృష్ణ, ఏప్రిల్ 7 ప్రభాతవార్త:** కృష్ణ మండలం, కున్సి గ్రామంలో వెలసిన శ్రీ వేణుగోపాలస్వామి వారి జాతర వేడుకలు ఈనెల 5 శనివారం నుండి ప్రారంభమయ్యాయి. ఈ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం తెల్లవారుజామున 5.30 నిమిషాలకు జరిగిన రథోత్సవంలో గ్రామస్తులు, యువకులు, ఉమ్మడి మండల బిజెపి నాయకులు నల్లే నర్సప్ప తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


## శ్రీరాముని మహా పట్టాభిషేకం

**లింగాల, ఏప్రిల్ 7 ప్రభాతవార్త:** శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం లింగాల మండల కేంద్రంలోని శ్రీ కోదండ రామాలయంలో శ్రీరాముని పట్టాభిషేకం వైభవంగా నిర్వహించారు. శ్రీరామచంద్రుని అనుగ్రహంతో వర్షాలు, సమృద్ధిగా కురిసి పంటలు పండాలని, సకల శుభములు పొందాలని పట్టాభిషేకం కార్యక్రమం నిర్వహించారు. భక్తులు కార్యక్రమంలో శ్రీరాముని పాలన, చక్కగా ఉన్నదో, అలామనస్ఫూర్తిగా జీవనం కొనసాగాలని కోరారు. కార్యక్రమంలో అర్చకులు సుదర్శనచార్యు లు, రామాచార్యులు, ఆలయ చైర్మన్‌పూజారి భాస్కర్, కమిటీ సభ్యులు, వికాస తరంగిణి మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అప్పు కోసం ఇరువురి పరస్పరం దాడి

**నవాబుపేట, ఏప్రిల్ 7 ప్రభాతవార్త :** ఇచ్చిన అప్పు తీర్చలేదని ఒకరు ప్లాట్ కాగితాలు ఇవ్వడం లేదని మరొకరు ఒకరిపై ఒకరు మాటల యుద్ధంతో మొదలైన గొడవ కొట్లాటకు దారితీసి నవాబుపేట పోలీస్ స్టేషన్లో ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే నవాబుపేట మండల కేంద్రానికి చెందిన మాందువాదా శివకుమార్ యాదవ్ తండ్రి కృష్ణయ్య గత ఆరు నెలల క్రితం మండల కేంద్రానికి చెందిన వడ్డేకాశి అలియాస్, చిన్నతల్లి కిష్టప్ప, అను వ్యక్తికి రూ.2 లక్షల అప్పుగా ఇచ్చి ఆ అప్పుకి భరోసాగా వడ్డేకాశికి చెందిన ప్లాట్ కాగితాలు శివ కుమార్ దగ్గర కుదువ పెట్టి అప్పుగా తీసుకున్నాడు. కాగా నిన్న ఆదివారం ఆరవ తారీకు ఇద్దరూ మద్యం సేవిస్తూ మాటల యుద్ధంతో మొదలై అప్పు విషయంలో ఇద్దరి మధ్య గొడవ రాగా ఇరువురు బూతు మాటలతో ఒకరిపై ఒకరు దాడికి దిగారు. అనంతరం స్వల్ప గాయాలతో ఇరువురూ నవాబుపేట పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత



**జడ్చర్ల, ఏప్రిల్ 7, ప్రభాత వార్త:** మున్సిపాలిటీ పరిధిలోని తమ వార్డులో అనారోగ్యంతో ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందిన బాబన్నకు ఎమ్మెల్యే ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్‌రెడ్డి సహకారంతో సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరైనట్లు కౌన్సిలర్ కుమ్మరిరాజు తెలిపారు. ఈమేరకు బాధితుడికి మంజూరైన రూ.50 వేల చెక్కును సోమవారం టౌన్ ప్రెసిడెంట్ మినాజ్, కాంగ్రెస్ నాయకుడు రవి యాదవ్‌తో కలిసి అందజేసినట్లు కౌన్సిలర్ కుమ్మరి రాజు తెలిపారు. పేదల ఆరోగ్యానికి సర్కారు భరోసానిస్తున్నదని ఈ సందర్భంగా రాజు పేర్కొన్నాడు.

## పేటలో కల్తీ కిక్కు

◆ అనుమతి 4, అక్రమంగా 10కి పైనే..
◆ ఇష్టారీతిగా కల్లు దుకాణాల నిర్వహణ
◆ ఇల్లు, ఒల్లు గుల్ల చేసుకుంటున్న కల్లు ప్రియులు
◆ ప్రజల ప్రాణాలతో చెలగాటం
◆ పట్టనట్లు వ్యవహరిస్తున్న అధికార యంత్రాంగం



(ఫైల్)

**నారాయణపేట, ఏప్రిల్7 ప్రభాతవార్త:** నారాయణపేటలో కల్తీ కల్లు రాజ్యమేలుతున్నదనడంతో ఎలాంటి ఆశ్చర్యం లేదు. కల్లు తయారీకి ఇష్టారీతిగా మత్తు పదార్థాల వినియోగిస్తున్నట్లు తెలుస్తున్నది. అందకు స్థానిక నాయకుల అండదండలు పుష్కలంగా ఉన్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలా తమ కల్తీ కల్లు దందాను విచ్చలవిడిగా చేసుకుంటూ లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నట్లు సమాచారం. వివరాల్లోకి వెళ్తే.. నారాయణపేట పట్టణంలో కల్తీకల్లు వ్యాపారం స్వేచ్ఛగా కొనసాగుతున్నది. కల్తీకల్లు అమ్మకాలతో పేదల జీవితాలతో దుకాణ నిర్వాహకులు ఆటలాడుతున్నారు. సాధారణ కల్లుతో మత్తు రావడంలేదని, ఎక్కువ మత్తు ఇచ్చే ఆల్కహాల్ లిక్కర్‌కు అలవాటు పడుతుండడం, దాంతో కల్లువిక్రయాలు తగ్గుతున్నాయనిభావించి ఎక్కువ మత్తు ఇచ్చేలా వివిధ రసాయనాలు వేసి కల్లు తయారు చేస్తున్నారు. సాధా రణ లిక్కర్‌కంటే మత్తు ఎక్కువవచ్చేలా వివిధ రసాయనాలు వేసి కల్లు తయారు చేస్తున్నారు. కల్తీ కల్లు వ్యాపారం వెనకాల నారాయణపేట ఇద్దరు రిటైర్డ్ ప్రభుత్వఉద్యోగులు, అధికార పార్టీకి చెందిన ఓముఖ్య అనుచరుడుఉన్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.

**ఇదీ జరుగుతున్నది..:** సొసైటీ నుంచి లీజుకు తీసుకొని కల్లు వ్యాపారం నిర్వహిస్తున్నారు. పేటలో నాలుగు షాపులకు మాత్రమే ఎక్సైజ్ శాఖ అనుమతులు ఉన్నాయి. కానీ అనుమతులు లేకుండా 10కి పైనే దుకాణాలు అక్రమంగా ఏర్పాటు చేసి యథేచ్ఛగా తమ దందా కొనసాగిస్తున్నారు. గల్లికో కల్లు దుకాణం ఏర్పాటు చేసుకొని రోజుకు 200పెట్టెల కల్తీ కల్లు తయారుచేస్తున్నారు. కల్తీ కల్లు సేవించడం వల్ల తీవ్రమైన ఆరోగ్య సమస్యలు కూడా తలెత్తుతున్నాయి. ఇన్ఫెక్షన్లు, కీళ్ల నొప్పులు, శ్వాసకోస వ్యాధుల బారిన పడుతున్నారు. కొందరికి నాడి వ్యవస్థ నరాలపై తీవ్ర ప్రభావం చూపడంతో శరీర వ్యవస్థ దెబ్బతింటుంది. పేదల జీవితాలను కల్తీకల్లు చిత్తు చేస్తుంది, కల్తీకల్లు వ్యాపారం అక్రమార్కులకు వరంగా మత్తు ప్రియులకు శాపంగా మారింది. పేదలు కార్మికులు వ్యవసాయ కూలీలు రోజంతా పనిచేసే సాయంత్రం ఉపశమనం కోసం పురుషులు మహిళలు కల్లు తాగుతుంటారు. మద్యం ధరలను ఎక్కువ ఉండడంతో తక్కువ ధర (రూ.20)లో అదే కిక్ వస్తుండడంతో కల్తీకలను తాగుతున్నారు.

**మామూళ్ల మత్తులో ఎక్సైజ్ శాఖ?..**

పేటలోఎక్సైజ్ అధికారులు మాముళ్ల మత్తులో ఉంటూ కల్తీ కల్లుపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపణలు బాహటంగానే వినిపిస్తున్నాయి. నెలనెలా మామూళ్లు ముట్ట చెబితే.. చాలు అంతా సవ్యంగా జరుగుతున్నట్లు రిపోర్టులుతయారు చేయడం ఆనవాయితీగా మారింది. శాంపుల్స్ పేరుతో కొంత ల్యాబ్‌కు పంపడం.. పరీక్షలు చేయడం అంతా రొటీన్ అయింది. చెట్లే లేని ఈ ప్రాంతంలో లారీలకొద్ది కల్లు ఎలా తయారవుతుందో అధికారులు చెప్పాల్సి ఉన్నది. కల్లులో మత్తు ఎక్కించే క్లోరోహైడ్రేట్ ,డైజోఫామ్ ,సిల్వర్ యాష్, కల్తీ కళ్ళు తయారీకి మత్తు పదార్థాలు ఉపయోగిస్తున్నారు. ఈ మందు ధర మార్కెట్లో చాలా ఖరీదు అయిందని గీత కార్మికులే చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి కల్తీ కల్లుపై నిఘా పెంచాలని పేదల ప్రాణాలు కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

## ఇద్దరు టెక్నికల్ అసిస్టెంట్ల సరెండర్

**మల్దకల్, ఏప్రిల్ 7 ప్రభాతవార్త :** మల్దకల్ మండలం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కార్యాలయంలో పనిచేస్తున్న టెక్నికల్ అసిస్టెంట్లు అనూష ఇబ్రహీంలను జిల్లా డిఆర్డిఒ ఆఫీస్‌కి సరెండర్ చేసినట్లు ఎంపీడీఓ ఆంజనేయ రెడ్డి తెలిపారు. వీరు విధుల పట్ల నిర్లక్ష్యం, కూలీలకు పని కల్పించకపోవడం, ఫీల్డ్‌కు వెళ్లకపోవడం, సమావేశాలకు గైర్హాజరు కావడం పట్ల వారిని సరెండర్ చేసినట్లు ఆయన తెలిపారు. అదే విధంగా కేటిదొడ్డి మండలంలో పలువురు టెక్నికల్ ఆఫీసర్‌లకు షోకాజ్ నోటీసులు అందినట్లు సమాచారం.